# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 227 | మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



## రాష్ట్రంలో మరిన్ని పీఎస్‌పీ ప్లాంట్లకు అవకాశం

- మొత్తం 9 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉన్న పీఎస్‌పీలను నిర్మించవచ్చు.
- రాష్ట్ర ప్రభుత్వం అవకాశమిస్తే ప్లాంట్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక అందజేస్తాం
- శ్రీశైలం డ్యాం దిగువన 1200 మెగావాట్లు, నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ఆధారంగా 900 మెగావాట్లు
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల వద్ద మరో 2 వేల మెగావాట్లు
- రాష్ట్రంలోని ఇతర జలాశయాల వద్ద మిగిలిన ప్లాంట్లను నిర్మించవచ్చని ప్రాథమిక సర్వే
- తెహ్రీ జలవిద్యుత్ అభివృద్ధి సంస్థ(టీహెచ్‌డీసీ) సర్వే



హైదరాబాద్

తెలంగాణలో పంప్డ్ స్టోరేజీ విద్యుత్(పీఎస్‌పీ) ప్లాంట్లు నిర్మించేందుకు అవకాశాలున్నట్లు తెలిసింది. ఈ మేరకు తెహ్రీ జలవిద్యుత్ అభివృద్ధి సంస్థ(టీహెచ్‌డీసీ) సర్వే అందుకు సంబంధించిన అంశాలను వెల్లడించింది. ఈ సర్వేలోని వివరాల ప్రకారం..మొత్తం 9 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉన్న పీఎస్‌పీలను నిర్మించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం అవకాశమిస్తే ప్లాంట్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక అందజేస్తామని టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఈ సంస్థ అధికారులు ఇటీవల హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) అధికారులతో చర్చించినట్లు తెలిసింది. శ్రీశైలం డ్యాం దిగువన 1200 మెగావాట్లు, నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ఆధారంగా 900 మెగావాట్లు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల వద్ద మరో 2 వేల -మిగతా3లో




## అక్రమ రుణయాప్‌లు.. యమపాశాలు!

రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయించడం ఆనవాయితీగా మారింది. మారుతున్న టెక్నాలజీతో అప్పు కావాలనుకుంటున్నవారు బ్యాంకులకు బదులుగా రుణ యాప్‌లను వినియోగిస్తున్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా ధ్రువపత్రాలు, గుర్తింపు వివరాలు తెలియజేయకుండా వెంటనే అప్పులిస్తామంటూ ప్రకటించడంతో వాటి వలలో పడుతున్నారు. -2లో

### వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు
# సాధించాలి

- ఆ శాఖల అధికారులను వెంటనే బదిలీ చేయాలి
- పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారు
- ఆ శాఖల్లో కొందరిపై ఆరోపణలున్నాయి.. వారిని వెంటనే బదిలీ చేయాలి
- వాణిజ్య పన్నుల శాఖలో పన్నుల లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉంది
- పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలి
- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్

టీఎస్ఎండీసీతో పాటు గనుల శాఖల్లో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, ఆ శాఖల్లో కొందరిపై ఆరోపణలున్నాయని, వారిని వెంటనే బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సోమవారం సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో పలు కీలక అంశాలపై చర్చించారు. పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలని ఆదేశించారు. -మిగతా3లో




## మహిళా అధికారులకు శాశ్వత కమిషన్

- శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలనే విషయంలో మహిళా అధికారుల అభ్యర్థనను వదిలిపెట్టలేం
- కోస్ట్‌గార్డ్‌కు చెందిన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలి
- మీకు ఏర్పాటు చేయటం చేతకాకపోతే చెప్పండి
- తాము ఏర్పాటు చేస్తాం
- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు అల్టిమేటం

# లేఔట్‌ల క్రమబద్ధీకరణకు ఓకే

- ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం కీలక ప్రకటన
- బడ్జెట్ సమయంలోనే వివరాల సేకరణ
- 20 లక్షల మందికి లబ్ధి!
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి లేఔట్‌ల క్రమబద్ధీకరణకు అవకాశమివ్వాలని నిర్ణయం
- మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణకు అవకాశమివ్వాలని నిర్ణయం
- దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు తప్ప ఇతర లేఔట్‌ల క్రమబద్ధీకరణకు ఓకే



హైదరాబాద్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి లేఔట్‌లు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది. మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లేఔట్‌లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 20 లక్షల మంది దిగువ, మధ్య తరగతికి చెందిన దరఖాస్తుదారులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తు చేసుకున్న ఎంతోమంది గత మూడున్నరేళ్లుగా ఎదురుచూపులు చూస్తున్నారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం -మిగతా3లో



## అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు చెప్పేవన్నీ అబద్ధాలే

- వేల సంఖ్యలో భారత భద్రత బలగాలు మాల్దీవులలో ఉన్నారు
- అసలు విదేశాలకు చెందిన సాయుధ మిలిటరీ బలగాలు మాల్దీవులలో ఎవరూ లేరు
- భారత భద్రతా బలగాలు విషయంలో అబద్ధాలు చెబుతున్నారు

## బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ

- కవితకు ఈడీ నోటీసులు..
- బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే అనే వాళ్లను చెప్పుతో కొట్టాలి
- సీబీఐ, ఈడీ, బీజేపీకి సంబంధం లేదు
- వారికి ఉన్న అధికారాలు, ఆధారాలను అనుసరించి మాత్రమే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చర్యలు తీసుకుంటారు.
- తెలంగాణలో కూడా హైదరాబాద్ సహా 17 సీట్లు గెలుస్తాం.
- బండి సంజయ్ ఆసక్తికర కామెంట్స్

కరీంనగర్

తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందన్నారు బీజేపీ ఎంపీ బండి సంజయ్. అలాగే, బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే అనే వాళ్లను చెప్పుతో కొట్టాలని పిలుపునిస్తున్నట్టు ఆగ్రహంగా చెప్పారు. గతంలో కూడా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేసి మా కొంప ముంచారంటూ వ్యాఖ్యలు చేశారు. కాగా, బండి సంజయ్ మలి విడత ప్రజాహిత యాత్రలో భాగంగా హుస్నాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో -మిగతా3లో



# మహిళా అధికారులకు శాశ్వత కమిషన్

**న్యూఢిల్లీ:** కోస్ట్‌గార్డుకు చెందిన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేట్టం జారీ చేసింది. శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలనే విషయంలో మహిళా అధికారుల అభ్యర్థనను వదిలిపెట్టలేమని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది. కోస్ట్‌గార్డుకు చెందిన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ నేడు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. కోస్ట్ గార్డుకు చెందిన మహిళా అధికారులకు సంబంధించిన శాశ్వత కమిషన్‌ను ఇప్పటికీ ఎందుకు ఏర్పాటు చేయటం లేదని ప్రశ్నించారు. మీకు(కేంద్ర ప్రభుత్వం) ఏర్పాటు చేయటం చేతకాకపోతే చెప్పండి.. తాము ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కావున త్వరగా శాశ్వత కమిషన్‌లో మహిళా కోస్ట్ గార్డు అధికారులకు చోటు కల్పించాలని చీఫ్ జస్టిస్.. అటర్నీ జనరల్ ఆర్ వెంకటరమణీని ఆదేశించారు. ఈ విషయంలో అఫిడవిట్ దాఖలు చేయవల్సింది గా కోస్ట్‌గార్డును కోరుతామని అటర్నీ జనరల్.. సుప్రీం కోర్టుకు తెలియజేశారు. అదేవిధంగా నేవి, ఆర్మీతో పోల్చితే కోస్ట్‌గార్డు భిన్నమైనదని అటర్నీ జనరల్ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్ తదుపరి విచారణను సుప్రీం కోర్టు మార్చి 1కి వాయిదా వేసింది. ఇక.. ఇండియన్ కోస్ట్‌గార్డు





అధికారి ప్రియాంక త్యాగి దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 19 విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'కోస్ట్ గార్డు విషయంలో? మహిళా అధికారుల పట్ల ఎందుకు తేడాలు చూపుతున్నారు. మహిళా అధికారులు కోస్ట్ గార్డులో ఎందుకు ఉండకూడదు?. దేశ సరిహద్దుల్లో మహిళలు ప్రహారా కాస్తున్నప్పుడు.. సముద్ర తీరం గస్తీ కాయటంలో తప్పేంటి?. మీరే(కేంద్ర ప్రభుత్వం) నారీ శక్తి గురించి మాట్లాడుతున్నారు.. దాన్ని ఆచరణలో చూపించండి' అని కేంద్రాన్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది.

# నఫే సింగ్ హత్య కేసు: వెలుగులోకి కీలక విషయాలు

చండీగఢ్: ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ హర్యానా విభాగం అధ్యక్షుడు నఫే సింగ్ రాఠీ(70)ని గుర్తు తెలియని దుండుగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఢిల్లీకి సమీపంలోని బహదూర్‌గఢ్ వద్ద ఆదివారం ఆయన హత్యకు గురయ్యారు. అయితే నఫే సింగ్ హత్యపై ఆయన కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నఫే సింగ్ రాఠీ హత్యకు ఓ బీజేపీ నేతకు చెందిన కుటుంట సభ్యులే కారణమంటూ ఆరోపణలు చేస్తున్నారు. అయితే గతేడాది ఓ బీజేబీ నేత కొడుకు ఆత్మహత్య చేసుకోవడానికి నఫే సింగ్ కారణమంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నఫే సింగ్‌ను సదరు బీజేపీ నేత కుటుంబ సభ్యులే అంతమొందించి ఉంటారని ఆరోపిస్తున్నారు. గతేడాది జనవరిలో బహదూర్‌గఢ్‌కు చెందిన మాజీ మంత్రి మాంగే రామ్ నంబార్ధార్ కుమారుడు జగదీష్ రాఠీ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి కొన్ని రోజుల ముందు ఓ ఆడియోక్లిప్‌ను విడుదల చేశాడు. 'నఫే సింగ్ రాఠీతో పాటు మరికొంత మంది 2019లో నా షాప్,



పూర్వికుల నుంచి వచ్చిన కొంత భూమిని నా దగ్గర నుంచి అక్రమంగా లాక్కోవడానికి ప్రయత్నించారు. దాని కోసం నన్ను బెదిస్తున్నారు. నఫే సింగ్ రాఠీ, ఇతరులపై కేసు కూడా నమోదు చేశాను. అయితే కోర్టులో వారికి ముందస్తు బెయిల్ లభించింది' అని జగదీష్ రాఠీ.. ఆడియోలో మాట్లాడారు. అప్పట్లో ఆ ఆడియో? క్లిప్ సంచలనంగా మారింది. నఫే సింగ్ హత్య కేసులో జగదీష్ రాఠీ కుమారుడు గౌరవ్, సోదరుడు సతీష్ ఉన్నారు. నిందితుల్లో బీజేపీ నేత నరేంద్ర కౌశిక్, బహదూర్‌గఢ్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరోజ్ రాఠీ, ఇంకా ముగ్గురు బంధువులు కూడా ఉ?న్నట్లు తెలుస్తోంది. 'నేను ఎ?ప్పటి నుంటో అనుమానస్పద కదలికలను గమనిస్తూ ఉన్నా. అందుకే మా నాన్న(నఫే సింగ్ రాఠీ) జిమ్‌కు వెళ్లడాన్ని కూడా అడ్డుకున్న. ఎప్పుడూ నా సోదరులు నాన్నకు భద్రత కల్పిస్తూ ఉన్నారు. చాలా సార్లు నాన్నను టార్గెట్ చేశారు. కానీ, భగవంతుడి దయతో ఆయన బయటపడ్డారు. కానీ, నిందితులు ఒకే అవకాశం కోసం ఎదురు చూశారు' అని నఫే సింగ్ రాఠీ కొడుకు జితేంద్రా మీడియాకు వెల్లడిం?చారు. మరోవైపు.. నఫే సింగ్ రాఠీ హత్యపై హర్యానా ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశిస్తుందని రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్ తెలిపారు. సీబీఐ విచారణతో సంతృప్తి చెందుతామని ఎమ్మెల్యేలంతా అనుకుంటే ఈ కేసును తప్పకుండా సీబీఐకే అప్పగిస్తామని ఆయన అసెంబ్లీలో హామీ ఇచ్చారు.

# తొలి వేద గడియారం సిద్ధం.. అందుబాటులోకి ఎప్పుడంటే..

ప్రపంచంలోనే మొట్టమొదటి వేద గడియారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రూపొందింది. దీనిని మార్చి ఒకటిన ప్రధాని నరేంద్ర మోదీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ సంయుక్తంగా కాళిదాస్ అకాడమీలో ప్రారంభించనున్నారు. వేద గడియారానికి సంబంధించిన ఇన్‌స్టలేషన్, టెస్టింగ్ వర్క్ పూర్తయింది. భారత ప్రామాణిక సమయాన్ని ఈ వేద గడియారంలో చూడవచ్చు. ఈ గడియారంలో ఒక గంట అంటే 48 నిమిషాలు. ఈ గడియారం వేద సమయంతో పాటు వివిధ ముహూర్తాలను కూడా చూపిస్తుంది. ఉజ్జయినిలో క్రేన్ సాయంతో దాదాపు 80 అడుగుల ఎత్తులో వాచ్ టవర్ పై దీనిని అమర్చారు. దీనిని ప్రధాని నరేంద్ర మోదీ మార్చి ఒకటిన ప్రారంభించనున్నారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి డిజిటల్ వాచ్ కానుంది. ఇది భారతీయ ప్రామాణిక సమయం (ఐఎస్‌టీ), గ్రీన్‌విచ్ మీన్ టైమ్ (జీఎంటీ) మాత్రమే కాకుండా పంచాంగంతో పాటు ముహూర్తాల గురించిన సమాచారాన్ని అందిస్తుంది. సూర్యోదయం, సూర్యాస్తమయాలే కాకుండా సూర్య , చంద్ర గ్రహణాల గురించి కూడా తెలియజేస్తుంది. కాగా వేద క్లాక్ రీడింగ్ కోసం మొబైల్ యాప్ రూపొందించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిని స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, టెలివిజన్ తదితర పరికరాలలో వినియోగించే



అవకాశం త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ వేద గడియారాన్ని వ్యవస్థాపించేందుకు ఉజ్జయినిలోని జివాజీ అబ్జర్వేటరీ సమీపంలో 85 అడుగుల ఎత్తైన టవర్‌ను నిర్మించారు.

# అక్రమ రుణయాప్‌లు.. యమపాశాలు!

అధిక మొత్తం వడ్డీలు లాగుతున్న రుణయాప్‌ల ముసుగులోని నేరముఠాలు గడువు ముగిసి వసూళ్ల పర్వం ప్రారంభించాక వేధింపులకు దిగుతున్నాయి. అక్రమ రుణయాప్‌లు నిరుద్యోగులు, చిరుద్యోగులు, పేద విద్యార్థులు, వ్యాపారుల ఉసురుతీస్తున్నాయి. ఆ రుణయాప్‌లపై చర్యలు తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంకుతో కలిసి కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుందని గడచిన సెప్టెంబరులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అక్రమ రుణయాప్‌లను అరికట్టడానికి ఆర్‌బీఐ, సెబీలతోపాటు రెగ్యులేటరీ సంస్థలు చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్రమంత్రి చెప్పారు. దేశంలో నేడు రుణయాప్‌లు వేల సంఖ్యలో విస్తరించాయి. అందులో మోసపూరితమైనవేమిటో తెలియజేయాల్సిన బాధ్యతను, వాటన్నింటినీ నియంత్రించే కార్యాన్ని కేంద్రం రాష్ట్రప్రభుత్వాలకు, పోలీసు విభాగాలకు, రిజర్వ్‌బ్యాంకుకు వదిలేస్తే ఎలా అనే విమర్శలు వస్తున్నాయి. కేంద్ర మంత్రిత్వశాఖలు, టెలికాం సంస్థలు, సెబీ, రాష్ట్రాలు... అన్నీ కలిసికట్టుగా పని చేయాలని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేలల్లో రూపాయలు




ఎరగా చూపి వాటిని రుణాలిచ్చి లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్న అక్రమ ఆన్‌లైన్ రుణదాతలు భారీ మోసాలకు తెరతీస్తున్నట్లు సమాచారం. గతంలో దాదాపు రూ.170 కోట్ల పెట్టుబడితో ఏడాదిలోనే చైనాకు చెందిన ఓ రుణయాప్ సంస్థ ఏకంగా రూ.11,700 కోట్లు దండుకున్న ఘటనలు వెలుగుచూశాయి. ఒక్క హైదరాబాద్‌లోనే ఆన్‌లైన్ రుణయాప్‌లతో సుమారు రూ.32 వేలకోట్ల లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ ఆన్‌లైన్ రుణాల్లో వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజు ముందుగానే అప్పులో దాదాపు 35శాతం మేర మినహాయించుకుంటారు. గడువు తీరిన వెంటనే అధిక వడ్డీతో బాకీలు వసూళు చేస్తారు. డిమాండ్ చేసినమేరకు చెల్లించకపోతే రుణ తీసుకున్నపుడు మొబైల్‌లో అన్ని అనుమతులు ఇస్తారు కాబట్టి అప్పు తీసుకున్నవారి కాంటాక్ట్ వివరాలు, గ్యాలరీ, హిస్టరీ అన్ని రికార్డవుతాయి. దాంతో మార్ఫింగ్ చేసిన కుటుంబ సభ్యుల ఫొటోలు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తారు. దాంతో బాధితులు తట్టుకోలేక అడిగినంత ముట్టజెపుతారు. ఆన్‌లైన్ రుణయాప్‌ల నియంత్రణకు పటిష్ఠ చట్టాలు, చర్యలు తీసుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

## 'అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు చెప్పేవన్నీ అబద్ధాలే'



**మాలె:** భారత భద్రతా బలగాలపై మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు చేసిన వ్యాఖ్యలను మాల్దీవుల మాజీ విదేశాంగ మంత్రి, మాల్దీవీయన్ డెమోక్రటిక్ పార్టీ నేత అబ్దుల్లా షాహిద్ ఖండించారు. వేల సంఖ్యలో భారత భద్రత బలగాలు మాల్దీవులలో ఉ?న్నారని అధ్యక్షుడు మొయిజ్జు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అసలు విదేశాలకు చెందిన సాయుధ మిలిటరీ బలగాలు మాల్దీవులలో ఎవరూ లేరని తెలిపారు. పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున అధ్యక్షుడిగా ఎన్నికైన మహ్మద్ మొయిజ్జు అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతోంది. అప్పటి నుంచి భారత భద్రతా బలగాలు విషయంలో అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. తాజాగా వేలల్లో భారత భద్రత బలగాలు మాల్దీవులలో ఉన్నారంటూ మరో కొత్త అబద్ధానికి తెరతీశారని అబ్దుల్లా షాహిద్ దుయ్యబట్టారు. విదేశీ భద్రత బలగాల సంఖ్య విషయంలో నిర్దిష్టమైన సమాచారాన్ని అందిచటంలో ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత స్పష్టంగా తెలుస్తోందని ఎద్దేవా చేశారు. పారదర్శకత చాలా ముఖ్యమని.. నిజం గెలవాలని అ?న్నారు. ప్రస్తుతం 70 మంది భారత భద్రతా బలగాలు మాల్దీవులలో ఉన్నారు. అయితే.. మాల్దీవుల నుంచి భారత భద్రత బలగాల ఉపసంహరించుకోవాలనే నినాదంతో మహ్మద్ మొయిజ్జు పార్టీ గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ప్రచారం చేసి.. అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇక.. భారత్-మాల్దీవుల మధ్య దౌత్యపరమైన వివాదం కొనసాగుతున్న వేళ ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల్లో భాగంగా.. భారత దేశానికి చెందిన మూడు వైమానిక స్థావరాల్లోని భద్రతా బలగాల్లో ఒక స్థావరం సిబ్బందిని మార్చి 10 వరకు, మరో రెండు స్థావరాల సిబ్బందిని మే 10 వరకు భారత్ వెనక్కి తీసుకోవాలని అధ్యక్షుడు మొయిజ్జు కోరారు. ఇక..ఇటీవల భారత్ మాల్దీవులలో ఉన్న భద్రతా బలగాల బదులు నైపుణ్యం ఉన్న సిబ్బందని అక్కడికి బదిలీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

## కేంద్రంపై యూకే రచయిత నిటాషా సంచలన ఆరోపణలు



**లండన్:** భారత సంతతికి చెందిన యూకే ప్రొఫెసర్, రచయిత నిటాషా కౌల్‌కు భారత ప్రభుత్వం ఎంట్రీ నిరాకరించింది. కర్ణాటక ప్రభుత్వ ఆహ్వానం మేరకు బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన తనను ఇమిగ్రేషన్ సిబ్బంది అడ్డుకున్నారని ఆమె తెలిపారు. అనంతరం తిరిగి తనను లండన్ పంపేశారని, అడిగితే నీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వ అనుమతి లేదని చెప్పారన్నారు. ఈ విషయాలన్నింటిని ఆమె తాజాగా ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేశారు. "ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు' అనే అంశంపై మాట్లాడేందుకు కర్ణాటక ప్రభత్వం నన్ను ఆహ్వానించింది. కానీ కేంద్ర ప్రభుత్వం నన్ను ఎయిర్‌పోర్టులోనే ఆపేసి తిరిగి లండన్ పంపించివేసింది. నా వద్ద అవసరమైన డాక్యుమెంట్లన్నీ ఉన్నాయి. గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌పై విమర్శలు చేసినందుకే నన్ను వెనక్కిపంపుతున్నట్లు అధికారులు అనధికారికంగా నాతో చెప్పారు. లండన్ నుంచి 24 గంటల పాటు ప్రయాణించి బెంగళూరు వస్తే మళ్లీ 24 గంటలు అటు ఇటు తిప్పి నన్ను ఎయిర్‌పోర్టులోనే ఉంచారు. కనీసం ఆహారం, మంచినీళ్లు కూడా ఇవ్వలేదు. పడుకోవడానికి కొద్దిగా స్థలం చూపించారు. అక్కడ కూడా కనీసం దిండు ఇవ్వలేదు. సీసీ కెమరా పర్యవేక్షణలో ఉంచారు. నేను ఎన్నోసార్లు భారత్ వచ్చాను. నాకు దేశంలోకి అనుమతి లేనట్లు కనీసం ముందుగా కూడా చెప్పలేదు. కర్ణాటక ప్రభుత్వమే నాకు టికెట్లు ఇచ్చింది'అని కౌల్ ఎక్స్‌లో తెలిపారు.

## టీఎంసీ నేత అరెస్టుపై కోల్‌కతా హైకోర్టు క్లారిటీ

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సందేశ్‌ఖాలీ నిరసనలకు కారణ మైన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేత షేక్ షాజాహాన్‌పై కోల్‌కతా హైకో ర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. షాజహాన్ అరెస్టుపై ఎలాంటి తాము ఎలాంటి స్టే ఇవ్వలేదని స్పష్టం చేసింది. సుమోటోగా స్వీకరించిన ఈ కేసులో ఇంప్లీడ్ అవ్వా ల్సిందిగా ఈడీ, సీబీఐ, పశ్చిమ బెంగాల్ హోం శాఖ కార్యదర్శిలను కోర్టు ఆదేశించింది. రేషన్ స్కామ్‌లో షాజహాన్ ఇంట్లో సోదాల కోసం వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులపై జనవరి 5న దాడులు జరిగాయి. దాడులు జరిగినప్పటి నుంచి అతడు పరారీలోనే ఉన్నాడు. కాగా, షాజాహాన్ అరెస్టు హైకోర్టు పరిధిలో ఉందని, పోలీసుల చేతులను హైకోర్టు కట్టేసిందని టీఎంసీ ప్రధానకార్యదర్శి అభిషేక్ బెనర్జీ తాజా వ్యాఖ్యల నేపథ్యంలో హైకోర్టు క్లారిటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

## కాంగ్రెస్‌పై పార్టీ వీడిన తమిళ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

**చెన్నై:** కాంగ్రెస్‌లో మహిళలకు చోటు లేదని తాజాగా ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన తమిళనాడు ఎమ్మెల్యే విజయ వర్ధిని అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్‌కు గత 14 ఏళ్లుగా ఉన్న ఒకే ఒక మహిళా ఎమ్మెల్యేను నేను. నన్ను కూడా పార్టీలో నుంచి వెళ్లకుండా ఆ పార్టీ ఆపలేకపోయింది. దీన్ని బట్టే ఆ పార్టీ ఎలా పనిచేస్తోందో అర్థమవుతోంది. ఒక మహిళ ఎమ్మెల్యే పదవి దగ్గరే ఎందుకు ఆగిపోవాలి. బీజేపీ మహిళలకోసం ఎంతో చేస్తోంది. ఆపార్టీ తరపున పార్లమెంట్‌లో మహిళా ఎంపీలు చాలా మంది ఉన్నారు. బీజేపీ చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్‌లు ఇచ్చింది. త్రిపుల్ తలాక్‌ను రద్దు చేసింది. ముస్లిం మహిళలు కేవలం బీజేపీకే ఓటు వేస్తారు'అని విజయవర్ధిని అన్నారు. కన్యాకుమరి జిల్లాలో విల్వన్‌కోడ్ నియోజకవర్గం నుంచి 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున విజయవర్ధిని ఎమ్మెల్యేగా గెలిచారు. శనివారం(ఫిబ్రవరి 24)న ఆమె కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు.

## బీజేపీ ఒంటరిగా 370 సీట్లు గెలుచుకోలేదు

లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా 370 సీట్లను గెలుచుకోలేదని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తెలిపారు. ఒకవేళ 370 సీట్లను గెలుచుకుంటే అద్భుతమేనని అన్నారు. తాము ఒంటరిగానే 370 సీట్లను సాధిస్తామని పార్లమెంటులో ప్రధాని మోదీ చెప్పారని... బీజేపీ శ్రేణులను ఉత్తేజితులను చేసేందుకే ఆయన అలా అని ఉంటారని చెప్పారు. పశ్చిమ బెంగాల్ లో బీజేపీ ఈసారి గతం కంటే మెరుగైన ఫలితాలను సాధిస్తుందని పీకే అంచనా వేశారు. సందేశ్ ఖలి ఘటనతో బెంగాల్ లో బీజేపీ పని అయిపోయిందని భావిస్తున్న వారికి... బెంగాల్ ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేస్తాయని చెప్పారు. తమిళనాడులో తొలిసారి బీజేపీ డబుల్ డిజిట్ ఫిగర్ సాధిస్తుందని చెప్పారు. తెలంగాణలో సైతం బీజేపీ మంచి ఫలితాలను సాధిస్తుందని తెలిపారు. 2024 ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే... ప్రజాస్వామ్య వ్యవస్థలు మరింత బలహీనంగా మారుతాయని పీకే చెప్పారు. ఎవరైనా వ్యక్తి కానీ, ఒక గ్రూప్ కానీ శక్తిమంతంగా మారినప్పుడు సమాజం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం రాజీపడుతుందని అన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కూడా దీనికి ఒక ఉదాహరణ అని చెప్పారు. మన దేశ పరిస్థితి చైనా అంతలా మారకపోయినా... నిరంకుశ పాలన సంకేతాలు మాత్రం మరింత ఎక్కువవుతాయని అంచనా వేశారు. అయితే, దేశంలో 15 రాష్ట్రాలను విపక్ష పార్టీలు పాలిస్తున్నాయనే విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలని చెప్పారు. ఇండియా కూటమి చాలా ఆలస్యంగా ఏర్పడిందని.. గత ఏడాది ఆ కూటమి 10 రోజులకు మించి పనిచేయలేదని పీకే అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 7 రోజల పాటు యూరప్ కు వెళ్లారని... ఇండియా కూటమి కనీసం అన్ని రోజుల పాటు కూడా ఎందుకు పని చేయలేకపోయిందని ప్రశ్నించారు. 2024 ఎన్నికలను దాటి ఇండియా కూటమి చూడాల్సి ఉందని సూచించారు.

# లేఔట్‌ల క్రమబద్ధీకరణకు ఓకే

-మొదటి పేజీ తరువాయి
తీసుకుంది. 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించి లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. 2024 మార్చి 31లోపు దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణ అవకాశం కల్పించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లేఅవుట్‌లు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దాదాపు 20 లక్షల మంది దరఖాస్తుదారులకు ప్రయోజనం చేకూరనుంది. నగర, పురపాలికలు, పంచాయతీల పరిధిలో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో గత ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించడంతో 20 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. ఈ మేరకు క్రమబద్ధీకరణను చేపట్టే క్రమంలో న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ విషయమై రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ విధానం ఏమిటన్నది ఇప్పటివరకు సందిగ్ధంగా ఉంది. తాజా ప్రకటనతో దరఖాస్తుదారులకు ఊరట లభించినట్లయింది.



### బడ్జెట్ సమయంలోనే వివరాల సేకరణ
రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పెండింగుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై స్పష్టతనిస్తూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఆ పథకాన్ని కార్యరూపంలోకి తీసుకువస్తే ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అధికారులు సైతం ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. అనధికారిక అంచనాల ప్రకారం అందిన దరఖాస్తులను క్రమబద్ధీకరించడం ద్వారా సుమారు రూ.10 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

### మూడు దశల్లో పరిశీలన
దరఖాస్తుల పరిశీలనకు న్యాయస్థానాల నుంచి అప్పట్లో అనుమతి లభించడంతో గతంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తిచేశారు. ఆ ప్రక్రియను మూడు దశల్లో చేపట్టారు. తొలిదశలో దరఖాస్తుల పరిశీలన రెండో దశలో ఆయా స్థలాలు క్రమబద్ధీకరణకు అర్హమైనవా? కాదా? అని గుర్తించడం.. అర్హతలు ఉన్నట్లు భావిస్తే సిఫార్సు చేయడం.. మూడో దశలో సంబంధిత అధికారి నిబంధనల మేరకు ఫీజు చెల్లించాలంటూ నోటీసుల జారీకి అనుమతించడం. ఈ మేరకు పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేశారు. 2020లో కేవలం రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. కానీ నోటీసులు అందుకున్నవారు అయోమయంలో ఉన్నారు. తాజా ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఉపశమనం కలిగినట్లయింది.

### క్రమబద్ధీకరణ ఛార్జీలు ఇలా..
- చదరపు గజం రూ. 3,000 కంటే తక్కువ ఉన్న సబ్–రిజిస్ట్రార్ విలువ 20 శాతం ఉంటుంది.
- రూ. 3,001 -రూ. 5,000 మధ్య 30 శాతం
- రూ. 5,001 -రూ. 10,000 మధ్య 40 శాతం
- రూ. 10,001 -రూ. 20,000 50 శాతం
- రూ. 20,001 -రూ. 30,000 మధ్య 60 శాతం
- రూ. 30,001 -రూ. 50,000 మధ్య 80 శాతం

చదరపు గజం సబ్–రిజిస్ట్రార్ విలువ రూ. 50,000 పైన 100 శాతం ఉంటుంది. పై ఛార్జీలకు అదనంగా ఎల్‌ఆర్‌ఎస్ ?క్రమబద్ధీకరణలో నాలా(వ్యవసాయ భూమిని వ్యవసాయేతర వినియోగానికి మార్చడానికి) రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆమోదం పొందని లేఅవుట్‌లో 10 శాతం ఖాళీ స్థలం అందుబాటులో లేనట్లైతే ఆగస్టు 26 నాటికి ఉన్న ధరకు బదులుగా, ప్లాట్ రిజిస్ట్రేషన్ తేదీ నాటికి ఉన్న ప్లాట్ విలువలో 14 శాతం చొప్పున ప్రో–రేటా ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

### దరఖాస్తుదారులు పాటించాల్సిన నిబంధనలు
రోడ్డు వెడల్పు కనీసం తొమ్మిది మీటర్లు ఉండాలి. బలహీన వర్గాలకు చెందిన వారి లేఅవుట్‌లు లేదా 100 చదరపు మీటర్ల కంటే తక్కువ ఉన్న ప్లాట్‌ల్లో రహదారి వెడల్పు ఆరు మీటర్లు ఉండవచ్చు. అవసరమైన రహదారి వెడల్పు అందుబాటులో లేకపోతే రెండు వైపులా సమానంగా వెడల్పు చేయడానికి అవసరమైన భూమి ఉండాలి. ల్యాండ్ సీలింగ్ చట్టాలు, భూ వివాదాలు లేదా టైటిల్, సరిహద్దు వివాదాలు, కోర్టు వ్యవహారాలు ఉంటే లేఅవుట్‌లు క్రమబద్ధీకరణ చేయబడవు. అసైన్డ్ భూములకు సంబంధించి జిల్లా కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆమోదంలేని లేఅవుట్‌లో క్రమబద్ధీకరణకు కొంతమంది ప్లాట్ హోల్డర్లు ఆసక్తి చూపినా కాంపిటెంట్ అథారిటీ ఆమోదించిన లేఅవుట్ నమూనానే పరిగణిస్తారు. దరఖాస్తుదారులు సేల్ డీడ్/ టైటిల్ డీడ్ కాపీలను మాత్రమే అందించాలి. విక్రయ ఒప్పందం లేదా లీగల్ నోటరీ పరిగణించరు. నీటి వనరులకు సంబంధించిన చెరువు, కుంట, షికం భూముల్లోని లేఅవుట్‌లను క్రమబద్ధీకరించరు. నీటి వనరులు ఉన్న ప్రాంతాన్ని గ్రీన్ బఫర్ జోన్‌గా నిర్ణయిస్తారు.
- 10 హెక్టార్లు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోని లేఅవుట్లు నదీ ప్రవాహం/ సరస్సుల సరిహద్దు నుంచి 30 మీటర్లు ఉండాలి. కాలువ సరిహద్దుల నుంచి 9 మీటర్లు ఉండాలి. 'నాలా' లేదా మురికినీటి కాలువ నుంచి రెండు మీటర్లు ఉండాలి.

# బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ

-మొదటి పేజీ తరువాయి
మాట్లాడుతూ.. సీబీఐ, ఈడీ, బీజేపీకి సంబంధం లేదు. వారికి ఉన్న అధికారాలు, ఆధారాలను అనుసరించి మాత్రమే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చర్యలు తీసుకుంటారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటే. గతంలో వారే అధికారాన్ని పంచుకున్నారు. యూపీఏ హయాంలో కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నారు. గతంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని ప్రచారం చేసి మా కొంపముంచారు. ఇప్పుడు మళ్లీ అదే మాట అంటున్నారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెబుతాం. విజయ సంకల్ప యాత్రలకు మంచి స్పందన ఉంది. వారం రోజుల్లో తెలంగాణలో వీలైనన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించబోతున్నాం. కేంద్రంలో 370 పార్లమెంట్ స్థానాల్లో గెలుపే మా టార్గెట్. ఆ టార్గెట్‌ను తప్పకుండా రీచ్ అవుతాం. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అవుతారు. తెలంగాణలో కూడా హైదరాబాద్ సహా 17 సీట్లు గెలుస్తాం. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుంది. బీఆర్‌ఎస్ పార్టీది మూడో స్థానమే. కొండగట్టుకు నిధులు ఇస్తామని కేసీఆర్ మోసం చేశారు. కొండగట్టు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. కేంద్రం నుంచి తప్పకుండా సహకారం ఉంటుంది అని వ్యాఖ్యలు చేశారు.

రాముడు అయోధ్యలో పుట్టాడని గ్యారెంటీ ఏమిటని అడిగిన వాళ్లను అలా అడిగితే తప్పేంటి?: బండి సంజయ్

శ్రీరాముడు అయోధ్యలో పుట్టాడని గ్యారెంటీ ఏమిటి? అని అడిగినవాళ్లను... మీరు మీ అమ్మకే పుట్టారని గ్యారెంటీ ఏమిటి? అని అడిగితే తప్పేమిటి? అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడ నుంచి రెండో విడత ప్రజాహిత యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా కొహెడ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారని... కానీ రైతు రుణమాఫీ అమలు చేశారా? అని నిలదీశారు. రూ.500కే గ్యాస్, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ అక్రమాలపై కొట్లాడింది తానేనని, దీంతో తనపై వంద కేసులు పెట్టిందని మండిపడ్డారు. తాను 150 రోజుల పాటు ఎండనక, వాననక, చలి అనక ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేశానన్నారు. కేసీఆర్‌ను గద్దె దించింది... కొట్లాడింది బీజేపీ అయితే మీరు మాత్రం కాంగ్రెస్‌కు ఓటు వేశారని సభకు వచ్చిన వారిని ఉద్దేశించి అన్నారు. పేదల కోసం బీజేపీ కొట్లాడినా ఓట్లు వేయలేదని... కాంగ్రెస్ కొట్లాడకున్నా ఓట్లు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అన్నారు.. మరో 20 రోజుల్లో అన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండడంతో మళ్ళీ ఆరు గ్యారంటీలకు మంగళం పాడతారని అనుమానం వ్యక్తం చేశారు.



రామమందిరాన్ని తామే కట్టామని కచ్చితంగా చెప్పుకుంటామని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. మీరు బాబ్రీ మసీదును కడతామని చెప్పుకుంటే ఎవరు వద్దన్నారని కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు. రానున్న ఎన్నికలు దేశానికి సంబంధించిన ఎన్నికలు.. మోదీ ప్రధాని కావాలా? లేక రాహుల్ కావాలా? మోదీని మళ్లీ ప్రధానిగా చేయకుంటే మందిరం పోయి మసీదు వస్తుంది... ఇక ప్రజలే తేల్చుకోవాలని హెచ్చరించారు.

### కరీంనగర్‌కు ఏం చేశానంటే..!
మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రతిరోజు తనను తిట్టడమే పని అని మండిపడ్డారు. కరీంనగర్‌కు ఏం చేశానో తనను అడిగే ముందు ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి తాను రూ.697.87 కోట్లు తెచ్చానన్నారు. పేదోళ్లకు కరోనా వాక్సిన్ ఉచితంగా ఇచ్చామని గుర్తు చేశారు.

# వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలి

-మొదటి పేజీ తరువాయి
వాణిజ్య పన్నుల శాఖలో పన్నుల లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని సీఎం ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకు పైగా చెల్లించేదని, ఆ గడువు ముగియడంతో నిధులు రావట్లేదని రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

### మద్యం సరఫరా వాహనాలకు అవి ఉండాల్సిందే..
మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రతీ డిస్టిలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం ఉండాలని, మద్యం సరఫరా వాహనాలు వే బిల్లులు కచ్చితంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

### ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం
అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులపై కంకర కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారని, అలా కాకుండా నగరంలో వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలను అందుకు వినియోగించాలని సూచించారు. ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలని సీఎం ఆదేశించారు. వే బిల్లులతో పాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వకూడదని సీఎం రేవంత్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి నందుకుగానూ పలు గనులపై గతంలో జరిమానాలు విధించారని, కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. విధించిన జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. గతంలో జరిమానాలు విధించి తర్వాత వాటిని తగ్గించారని, అందుకు కారణాలు ఏమిటో తెలియజేయాలని, దానిపై నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో సింగరేణిది కీలకపాత్ర: సీఎం రేవంత్

తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కీలకపాత్ర పోషించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో బీజేపీతో.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుమ్మక్కు అయ్యి సింగరేణి సంస్థ భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశారని మండిపడ్డారు.

## రాష్ట్రంలో మరిన్ని పీఎస్‌పీ ప్లాంట్లకు అవకాశం..



-మొదటి పేజీ తరువాయి
మెగావాట్లు, రాష్ట్రంలోని ఇతర జలాశయాల వద్ద మిగిలిన ప్లాంట్లను నిర్మించవచ్చని ప్రాథమిక సర్వేలో తెలిపింది. తెలంగాణలో ఈ ప్లాంట్లు నిర్మించేందుకు కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. జెన్‌కోకు శ్రీశైలం, నాగార్జునసాగర్ వద్ద నిర్మాణానికి మంచి అవకాశాలున్నాయని తెహ్రీ సంస్థ తెలిపింది. నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది.

### పీఎస్పీ అంటే..
పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ అనేది ఒక రకమైన జల విద్యుత్ శక్తి నిల్వ ప్రాజెక్టు. దీనిని వేర్వేరు ఎత్తులలో ఉన్న రెండు నీటి రిజర్వాయర్లపై నిర్మిస్తారు. ఈ ప్లాంట్లు సంప్రదాయ జల విద్యుత్ ప్లాంట్లలానే పనిచేస్తాయి. వీటికి అదనంగా అదే నీటిని మళ్లీ మళ్లీ ఉపయోగించుకునే సామర్థ్యం ఉంటుంది. అంతేకాదు పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లలో పగటిపూట చార్జింగ్ సౌర ఫలకల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. రాత్రి వేళ జలాశయం ద్వారా ఎగువ రిజర్వాయర్ నుంచి దిగువ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడం వల్ల టర్బైన్ కిందకి కదిలి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక సారి నిర్మించిన ప్రాజెక్టు ఎనభై ఏళ్ల వరకూ పనిచేస్తుంది. 1890 కాలంలో ఇటలీ, స్విట్జర్లాండ్‌లో మొదలైన పీఎస్పీ సాంకేతికత 1930లో యునైటెడ్ స్టేట్స్‌లో అడుగుపెట్టింది. ఇప్పుడిది ప్రపంచమంతా విస్తరించింది. తాజాగా మన దేశంలో పీఎస్పీల స్థాపనలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా అవతరించింది.

### ఏపీలో ఇలా..
దేశం మొత్తం మీద 2030–31 నాటికి 18.8 గిగావాట్ల సామర్థ్యం ఉన్న పీఎస్‌పీల అవసరం ఉందని కేంద్ర ఇంధన శాఖ అంచనా వేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎగువ సీలేరులో 1,350 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్‌పీ నిర్మాణానికి కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) అనుమతి కూడా ఇచ్చింది. ప్రైవేటు రంగంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పిన్నాపురంలో గ్రీన్ కో గ్రూప్ 1,680 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మిస్తోంది


## ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సరైన వ్యక్తి...
## నా భవిష్యత్తు ఆయన చేతిలోనే

**తనకు మంచి అవకాశం వస్తుందేమోనన్న దయాకర్**

**లీడర్ లేని పార్టీగా బీఆర్‌ఎస్ తయారయిందని ఎద్దేవా**

**కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని నిలదీత**

**ఇండియా కూటమి విచ్ఛిన్నానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపణ**



తెలంగాణకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సరైన వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్ అన్నారు. సోమవారం ఆయన గాంధీ భవన్?లో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం లీడర్ లేని పార్టీగా బీఆర్‌ఎస్ తయారైందని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు అనుకూలంగా ఉండే కిషన్ రెడ్డిని... బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమించారని ఆరోపించారు. బిజీగా ఉన్నానని చెబితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ మద్యం కేసు నుంచి మినహాయింపు ఇచ్చినట్లుగా... హేమంత్ సోరెన్, సోనియాగాంధీ వంటి మిగతా నాయకులకు ఎందుకు ఇవ్వరు? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. కేసీఆర్ చేసిన అవినీతిని కాపాడింది బీజేపీయే అని విమర్శించారు. తాము మాత్రం అవినీతిపరులను ఎవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు ఇచ్చిన వారిని కూడా వదలమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు బీజేపీ చేసింది ఏమీ లేదని... కాంగ్రెస్ వైపు ప్రజలు ఉన్నారన్నారు. బీజేపీకి రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు.

### రేవంత్ రెడ్డి చేతిలో భవిష్యత్తు...
తన భవిష్యత్తు రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధిష్ఠానం చేతిలో ఉన్నాయని అద్దంకి దయాకర్ అన్నారు. కాంగ్రెస్ తనను ఒక అస్త్రంగా ఉపయోగించుకుంటుందేమో... తనకు మంచి అవకాశం వస్తుందేమో అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు
ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని అద్దంకి దయాకర్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ముద్దుబిడ్డ మాజీ సీఎం కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, ఇండియా కూటమికి మద్దతిచ్చే పార్టీల నేతలే లక్ష్యంగా కేంద్రం దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఉద్ధవ్ ఠాక్రే, హేమంత్ సోరెన్, ఎన్సీపీ, విపక్ష నేతలే టార్గెట్‌గా బీజేపీ దాడులు చేస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ దోస్తీగా ముందుకు సాగాయని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కేసులో మొట్టమొదట వేటు వేయాల్సింది ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ పైన అని... ఆయనను కాపాడింది ఎవరు? అని ప్రశ్నించారు. తమతో పొత్తు కారణంగా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

## ఎమ్మెల్యేగా గెలిస్తే ఒక్కరోజు మాత్రమే ఆనందంగా ఉండేవాడిని!: జగ్గారెడ్డి

**ఇప్పుడు ప్రతిరోజూ సంతోషంగా ఉన్నానన్న జగ్గారెడ్డి**

**తనకు లోక్ సభ టిక్కెట్ కావాలనుకుంటే రాహుల్, రేవంత్ రెడ్డిలను అడుగుతానని వ్యాఖ్య**

**బీజేపీలో చాలామంది షార్ట్ కట్ నేతలున్నారని విమర్శలు**



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాను గెలిచి ఉంటే కనుక గెలిచిన ఒక్కరోజు మాత్రమే ఆనందంగా ఉండేవాడినని... కానీ ఇప్పుడు ప్రతిరోజూ సంతోషంగా ఉంటున్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో తనకు టిక్కెట్ కావాలనుకుంటే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడుగుతానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీపై ఆయన మండిపడ్డారు. ఆ పార్టీలో చాలామంది షార్ట్ కట్ నేతలు ఉన్నారని విమర్శించారు. ఆ పార్టీలోని నేతల చరిత్ర అంతా తనకు తెలుసునని ధ్వజమెత్తారు.

## సంపాదకీయం


# సైన్యానికి పాక్ ఓటరు గుణపాఠం

బ్రిటిష్ పాలకులు కుతంత్రంగా జరిపిన దేశ విభజన అనంతరం భారత దేశంతో పోల్చుకుంటే పాకిస్తాన్ పుష్కలమైన ఆర్థిక వనరులతో సంపన్న దేశంగా ఉండెడిది. అయితే, పలు కారణాల చేత సుపరిపాలన లోపించడంతో, పాలనా యంత్రాంగంపై సైనిక నాయకత్వం ఆధిపత్యం కొనసాగుతూ ఉండడంతో స్వతంత్రించి దేశాభివృద్ధి లక్ష్యంగా పని చేసే ప్రభుత్వాలు మనుగడ సాగించలేకపోయాయి. తరచుగా సైనిక తిరుగుబాటు, ఎన్నికలు జరిగినా సైన్యం చెప్పుచేతలలో ఉండేవారే ఎన్నికవుతూ ఉండటం, సైనిక నాయకత్వం తీవ్రమైన అవినీతితో ఉండడంతో దేశం ఆర్థికంగా ఛిన్నాభిన్నం కావడం జరుగుతూ వచ్చింది. మొదటి నుంచి ప్రభుత్వంపై తమ ఆధిపత్యం కొనసాగించడం కోసం భారత్‌ను ఒక బూచిగా చూపుతూ, తాము లేకపోతే భారత్ దురాక్రమణ చేస్తుందనే భయం సృష్టించే ప్రయత్నం సైనిక నాయకత్వం చేస్తూ వచ్చింది. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు దిగడం ద్వారా భారత్‌తో సాధారణ సంబంధాలకు అవకాశం లేకుండా సైనిక ఉద్రిక్తలకు దోహదపడుతూ వచ్చారు. బెనజీర్ భుట్టో, నవాజ్ షరీఫ్ వంటి కొందరు ప్రధానులు భారత్‌తో మంచి సంబంధాలకు చొరవ తీసుకున్నప్పటికీ వారిని అర్థాంతరంగా గద్దె దింపారు. చివరకు ప్రధాన మంత్రి ప్రమేయం లేకుండా సైన్యాధిపతిగా ముషారఫ్ కార్గిల్ దురాక్రమణకు సాహసించడం తెలిసిందే. సైన్యపు నిర్వాకం ఫలితంగా నేడు పాకిస్తాన్ ఒక 'రోగ్' దేశంగా, తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించే ప్రమాదకర దేశంగా, సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న దేశంగా అంతర్జాతీయంగా అపఖ్యాతి పాలయింది. నిత్యావసర వస్తువులు గగనమై, అప్పిచ్చేవారే లేక దేశం అలమటిస్తున్న సమయంలో ఫిబ్రవరి 8న జరిగిన ఎన్నికల్లో సైన్యం బలపరిచిన పార్టీలు, నేతలకు ఆ దేశ ప్రజలు ఓ విధమైన గుణపాఠం నేర్పారు. గత ఎన్నికల్లో సైనిక మద్దతుతోనే ప్రధాన మంత్రి పదవి చేపట్టి, ఆ తర్వాత సైన్యంతో పొసగక పదవి కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్‌ను జైలులో ఉంచినా, ఆయన పార్టీకి గుర్తింపు లేకుండా చేసినా, పెద్ద ఎత్తున రిగ్గింగుకు పాల్పడినా 101 మందిని స్వతంత్ర అభ్యర్థులుగానే గెలిపించి ప్రజాస్వామ్యం పట్ల ఆ దేశ ప్రజలు తమ స్పష్టమైన తీర్పు ఇచ్చారు. అయితే, ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో సుమారు రెండు వారాల పాటు తర్జనభర్జనలు పడిన తర్వాత చివరకు సంకీర్ణ ప్రభుత్వానికి మార్గం ఏర్పడింది. రాజకీయ విద్వేషాలను పక్కన పెట్టి అధికారం కోసం నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్- నవాజ్ (పిఎంఎల్-ఎన్), బిలావల్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. కేవలం తమకు ఎదురు తిరిగిన ఇమ్రాన్ ఖాన్‌ను రాజకీయంగా అంతం చేయడం కోసమే విదేశాలలో ఆశ్రయం పొందుతున్న నవాజ్ షరీఫ్‌ను దేశంలోకి రప్పించి, ఆయనపై ఉన్న కేసులను కొట్టి వేయించి, ఎన్నికల్లో పోటీపై ఉన్న ఆంక్షలను రద్దు చేయించి సైన్యం ఎంతగా మద్దతు ఇచ్చినప్పటికీ ప్రజా మద్దతు లభించలేదు. అనూహ్యమైన నగదు కొరతను ఎదుర్కొంటున్న పాకిస్తాన్ లో ఇప్పుడు ఎవరు ప్రధాని పదవి చేపట్టినా రాజకీయాలలో సైనిక జోక్యాన్ని ప్రజలు స్పష్టంగా తిరస్కరించారని ఫలితాలు వెల్లడి చేశాయి. గతంలో పలు పర్యాయాలు సైనిక తిరుగుబాటుతో సైన్యాధిపతులే దేశనాయకత్వం బాధ్యతలు చేపట్టారు. లేదా తమకు అనుకూలమైన కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పరిచారు. అయితే రాజకీయాలలో సైన్యపు ప్రత్యక్ష జోక్యం కారణంగా పాకిస్తాన్ అభివృద్ధిలో అధ్వానస్థితికి చేరుకొన్న వాస్తవాన్ని ఆ దేశ ప్రజలు ఇప్పుడు గ్రహించారు. దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆంతరంగిక భద్రత అంశాలను ఎవ్వరు ప్రభుత్వంలో ఉన్నా సైనిక కనుసన్నలలో నిర్వహిస్తూ ఉండడం ఆ దేశాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తున్నట్లు స్పష్టమైనది. అంతర్జాతీయంగా ఆ దేశ ప్రతిష్ఠ ఎన్నడూ లేనంతగా దిగజారింది. చివరకు అరబ్ దేశాలలో సహితం పాకిస్తాన్ పలుకుబడి సన్నగిల్లుతున్నది. పాకిస్థాన్‌లో ఏ ప్రధాన మంత్రి కూడా ఐదేళ్ల పూర్తి కాలాన్ని పూర్తి చేయలేకపోవడానికి సైన్యం జోక్యమే కారణం అని చెప్పవచ్చు. 1958లో పాకిస్తాన్ తన మొదటి సైనిక తిరుగుబాటును చూసింది. జనరల్ అయూబ్ ఖాన్ ప్రెసిడెంట్ ఇస్కాందర్ మీర్జా నుండి అధికారాన్ని చేజిక్కించుకున్నాడు, తరువాతి అతనిని ఆర్మీ స్టాఫ్ చీఫ్‌గా నియమించాడు. అయూబ్ ఖాన్ మార్షల్‌లా విధించి 1969 వరకు దేశాన్ని పాలించాడు. 1971లో భారత్‌పై జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ ఓడిపోయిన తర్వాత, జుల్ఫికర్ అలీ భుట్టో 1970లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధ్యక్షుడయ్యాడు. మూడు సంవత్సరాల తర్వాత ప్రధాన మంత్రి అయ్యాడు. జుల్ఫికర్ 1977లో ఎన్నికలలో మళ్లీ గెలిచాడు. కానీ అదే సంవత్సరంలో జనరల్ జియా-ఉల్-హక్ చేత పదవీచ్యుతుడయ్యాడు. జియా మార్షల్‌లా విధించారు. జాతీయ, అన్ని ప్రొవిన్షియల్ అసెంబ్లీలను రద్దు చేశారు. రాజ్యాంగాన్ని సస్పెండ్ చేశారు. జుల్ఫికర్‌ను జైలులో ఉంచి, ఉరి తీశారు. 1988లో విమాన ప్రమాదంలో జియా మరణించిన తర్వాత, బెనజీర్ భుట్టో ఆధ్వర్యంలో పిపిపి తిరిగి అధికారంలోకి వచ్చింది. 1999 వరకు పిఎంఎల్-ఎన్ , పిపిపిల మధ్య అధికార పోరు కనిపించింది. వీరిలో ఎవరూ పదవీకాలం పూర్తి చేయలేదు. 1999లో రక్తరహిత తిరుగుబాటులో నవాజ్ షరీఫ్‌ను జనరల్ పర్వేజ్ ముషారఫ్ తొలగించి బహిష్కరించారు. తదుపరి తిరుగుబాట్లు లేనప్పటికీ పాకిస్తాన్ సైన్యం ప్రభుత్వాలను పరోక్షంగా పర్యవేక్షించడంపై దృష్టి సారించింది. సైనిక ప్రాయోజిత ప్రభుత్వాన్ని సృష్టించే ప్రయత్నంలో ముషారఫ్ పిఎంఎల్-ఎన్, పిపిపిలను నిషేధించారు. పాకిస్తాన్‌లోని రాజకీయ పార్టీలు సైన్యపు ఆధిపత్య ధోరణి పట్ల అసహనంతో ఉంటూ ఉన్నప్పటికీ బలహీనమైన ఆర్థిక పరిస్థితి, ఏకాభిప్రాయం లేకపోవడం కారణంగా సైనిక ప్రయత్నాలను నిరోధించలేకపోతూ వస్తున్నారు. 2018 లో క్రికెట్ ప్రపంచంలో దిగ్గజ వ్యక్తి ఇమ్రాన్ ఖాన్ పిఎంఎల్-ఎన్, పిపిపిలను రెండింటినీ సైన్యం మద్దతుతో ఓడించి చరిత్ర సృష్టించారు. చిన్న పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఖైబర్ పఖ్తుంక్వా, పంజాబ్‌లలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఆ తర్వాత ఇమ్రాన్ పాలనతో సైన్యం విసుగు చెందటం,లెఫ్టినెంట్ జనరల్ నదీమ్ అర్జున్‌ను ఐఎస్ఐ చీఫ్ గా నియమించాలని ఇమ్రాన్ కోరినప్పుడు సైన్యంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. తదుపరి ఆర్మీ చీఫ్‌గా ఉండాలని భావించిన లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్‌ను తదుపరి ఐఎస్ఐ డిజిగా చేయడాన్ని ఖాన్ ప్రతిఘటించారు. ఆర్మీ చీఫ్ మునీర్‌ను ఐఎస్ఐ డిజిగా కూడా ఇమ్రాన్ తొలగించారు. మాజీ ఆర్మీ చీఫ్ కమర్ జావేద్ బజ్వాతో ఇమ్రాన్ సమస్యాత్మక సంబంధం పూర్తి శత్రుత్వానికి దారితీసింది. ఉక్రెయిన్ యుద్ధం వంటి విదేశాంగవిధానాలలో సైన్యానికి వ్యతిరేకంగా ఇమ్రాన్ వ్యవహరించారు. దానితో చివరికి 2022లో అవిశ్వాస తీర్మానం ద్వారా ఇమ్రాన్‌ను తొలగించారు. అప్పటి నుండి ఇమ్రాన్‌ను ఓ 'శత్రువు'గా సైన్యం చూడటం ప్రారంభమైంది. అరెస్టయి జైలుకు కూడా వెళ్లాల్సి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో చిరకాలం ప్రత్యర్థులుగా ఉన్న రెండు ప్రధాన పార్టీలుకలిసి ఏర్పరచే సంకీర్ణం సుస్థిరత ప్రశ్నార్థకమని చెప్పవచ్చు. అయితే, పొరుగు దేశంలో స్థిరమైన ప్రభుత్వం లేకపోవడం, అస్థిరమైన సంకీర్ణం అధికారంలో ఉండటం అంటే పరోక్షంగా సైనిక పాలన ఉన్నట్లే భారత్ భావించాల్సి వస్తుంది. దానితో భారత్ భద్రతా పరమైన సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

# సింహ స్వప్నం చంద్రశేఖర ఆజాద్

భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన "పండిత్‌జీ"గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాబ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు. 1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు 'ఆజాద్' అని, తన తండ్రి పేరును 'స్వతంత్రం', తన నివాసం 'జైలు' అని చెప్పాడు. "మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందు డైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో '15 కొరడల దెబ్బల' శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు 'చంద్ర శేఖర్ ఆజాద్' గా మారింది.

"సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే



తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. "నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో" – ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. "నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను" అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ. చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో 'ఆజాద్' వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

# బిసిల చాంపియన్ శివశంకర్

తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాలతా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బిసి కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బిసిల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు. కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు. 1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలో ని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడడముతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లి, కూలి పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తింటూ చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు.

న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసి తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు. 1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటి ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువు కోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడము సమాజాన్ని పట్టించు కోకుండా వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడము ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి



నిదర్శనం.

హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు. ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు. 1974-75లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జెన్సీ తర్వాత ఆయన ఇందిగా గాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికిందరాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంది మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు. 1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మధ్యలో ఆయన విదేశీ వ్యవహారాల శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988-89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడి గా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు.

ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీ కరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986 లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు. ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది.

రాజీవ్ హాయంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కే ప్రయత్నం చేయలేదు. రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక 2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు. శివశంకర్ జీవితాంతం అంబేద్కర్ , పూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల కాన్సెప్ట్ మీద పని చేశారు. జ్యుడీషియల్ తో సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు. ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హాయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే. నేడు, పి శివ శంకర్ ప్రధానమంత్రి తర్వాత దేశములో అత్యంత శక్తివంతమ్కెన వ్యక్తి" 1986 నాటికి ఇండియా టుడే పత్రిక రాసిన కథనాని బట్టి శివశంకర్ పలుకుబడి ఏ పాటిదో చెప్పకనే చెపుతుంది.

# స్థానిక వార్తలు

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండల కేంద్రములోని తహశీల్దార్ కార్యాలయంలో బట్టాపూర్, దొంచంద గుమ్మిర్యాల్, తడపాకల్, ఏర్గట్ల తాళ్లరాంపూర్, గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జెడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి ఆర్థిక భరోసానిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యూసుఫ్, ఆర్ఐ సదానంద్, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు

## తొర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**వాస్తవ నేస్తం ఏర్గట్ల:** మండలములోని తొర్తి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుండి ప్రారంభమై మార్చి 3 న ముగుస్తాయని వీడీసీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు తిరునగరి వేణుగోపాల స్వామి మాట్లాడుతూ.. మంగళవారం విశ్వక్ సేన ఆరాధన, పుణ్యావచనము, బుధవారం హోమము, ధ్వజారోహణం, గురువారం సుదర్శన శాతక పూలమంత్ర హవనము, బలిహరణం, శుక్రవారం కుంకుమార్చన, నారాయణ ఉపనిషత్ హవనము, శనివారం ఎదురుకోలు, స్వామి వారి కల్యాణం, రథహోమం, రథబలి, రథ ప్రాణప్రతిష్ఠ, రథోత్సవం, ఆదివారం పూర్ణాహుతి, నాగవెల్లి, ఉద్వాసన బలి, జాతర నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.

## మల్లన్న ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ పూజలు



**వాస్తవ నేస్తం,ముథోల్:** మండలంలోని ఎడ్ బిడ్ గ్రామంలో గల మల్లన్నదేవుడి జాతర ప్రారంభమైన నాలుగు రోజులుగా ఎంతో కనుల పండుగ కొనసాగుతుంది. దీంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే నారాయణ పటేల్ దర్శించుకుని ప్రత్యేక పూజలను చేసి మొక్కలను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి దేవుడి ఫోటోను, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ప్రతి ఏటా మల్లన్న జాతర సందర్భంగా నిర్వహించే కుస్తీ పోటీలను ఎమ్మెల్యే తిలకించారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు ప్రాంతం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలయ నిర్వాహ కులు, గ్రామస్థులు ఉన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగనక్క, మండల ఇంచార్జ్ రావుల గంగా రెడ్డి, యూత్ అధ్యక్షులు, రావుల శ్రీనివాస్, శంకర్ చంద్రే,కిషన్ పటేల్, కిషన్ పాతంగే, ఆంజనేయులు,శరత్,ముత్యం రెడ్డి,సాయినాథ్, ఆలయ నిర్వాకులుతదితరులు పాల్గొన్నారు.

## వెల్డర్ కార్మికుడు చంద్రశేఖర్ కి నష్టపరిహారం ఇప్పించిన రవిసింగ్




**వాస్తవ నేస్తం,కూకట్ పల్లి:** నియోజకవర్గంలోని బాలానగర్ ఇండస్ట్రీ ఏరియాలో ప్రభు ఏజెన్సీ కాంట్రాక్టర్, సర్వేశ్వరరావు వద్ద, పనిచేస్తూన చంద్రశేఖర్ అనే వెల్డింగ్ కార్మికుడు బాలనగర్ వసంత టూల్స్ కంపెనీలో రోజువారి పనిలో భాగంగా షెడ్డు వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడం జరిగింది. ఆ చంద్రశేఖర్ అనే కార్మికునికి రెండు చేతులకు గాయాలు కావడంతో వెంటనే అక్కడ పనిచేసే తోటి కార్మికులు అతన్ని హాస్పిటల్లో చేర్పించారు. ప్రభు ఏజెన్సీ కాంట్రాక్టర్ సర్వేశ్వరరావు ఆ కార్మికునికి ఆసుపత్రి చికిత్స రెండు లక్షల 60 వేల రూపాయల తో చేయించాడు... చంద్రశేఖర్ బాధితునికి గాను కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ ప్రభు ఏజెన్సీ కాంట్రాక్టర్ సర్వేశ్వరరావు తో మాట్లాడి బెడ్ రెస్ట్ మరియు కుటుంబ ఖర్చులకు చంద్రశేఖర్ కి లక్ష డెబ్బై వేల రూపాయలు ఇప్పించడం జరిగింది... కార్మికుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ నాకు మా కుటుంబ సభ్యులకు రోజువారి ఖర్చులకు డబ్బులు ఇప్పించిన రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంకు శివ స్వాముల మహా పాదయాత్ర



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** దైవ చింతన చేయడం ద్వారా ప్రతి ఒక్క మానవ జీవితంలో అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ పట్టణంలోని దాక్షాయణి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి శివ దీక్షా స్వాములు కొనియాడారు.సోమవారం మేడ్చల్ పట్టణ శివాలయం భక్త బృందం ఆద్వర్యంలో మాల దారణ ధరించిన శివ స్వాములు మేడ్చల్ పట్టణం నుండి శ్రీశైలం భ్రమరాంబ దేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయానికి మహా పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ మాట్లాడుతూ మేడ్చల్ శ్రీ రామలింగేశ్వ స్వామి దేవాలయం నుండి జ్యోతిర్ముడి కట్టుకోని శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న శివ స్వాములకు దరిపోడువున ఆ పరమేశ్వరుడి కరుణ అనుగ్రహం ఉండాలని వారి యాత్ర ఎటువంటి ఆటంకాలు లేకుండా జరగాలి అని అందరమూ ఆ పరమ శివుని వేడుకుందామని ఆలయ ప్రధాన అర్చకులు ఆల్కోడ్ కార్తీక్, మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్, శివ గురుస్వామి కొడే మహేష్ కురుమ, శివ గురుస్వాములు రుద్ర జనార్ధన్,అత్వెల్లి శ్రీనివాస్ గౌడ్, తోట రాజు, మామిండ్ల సత్యనారాయణ (వేణు), తమ్మలి సాయి కుమార్, పాదయాత్ర బయలుదేరిన శివ స్వాములు పవన్ యాదవ్,సంతోష్ కురుమ, సుధాకర్ నాయుడు,సాయి యాదవ్, సతీష్, రవి, బన్నీ, సౌమిత్,వినయ్, అనిల్, శేఖర్, మనోజ్ శివ స్వాములు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో అంగన్ వాడి భవనం



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని గోవిందాపురం (ఏ) గ్రామంలోని అంగన్వాడి భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రతిరోజు అంగన్వాడి కి హాజరవుతున్న చిన్నారులకు కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు నాడు నిర్మించిన రైతు వేదికలోకి అంగన్వాడి కేంద్రాన్ని తరలించారు. బాగం నాగేశ్వరరావు చిన్నారులకు హార్లిక్స్, పండ్లు అందజేశారు. గది పైపెచ్చులు ఊడి పడుతుండటంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారనీ అంగన్వాడి టీచర్ లక్ష్మీ తెలిపారు. అంగన్వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. దీంతో చేసేదేమీ లేక కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు ను ఆశ్రయించగా నాడువారు నిర్మించిన రైతు వేదికలో అంగన్వాడీ కేంద్రాన్ని నడుపుకోవాలని సలహా ఇచ్చినట్లు చెప్పారు. అంగన్వాడీ భవన మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేయాలని ఆళ్లపాడు ఎంపిటిసి పారా శ్రీదేవి భట్టి విక్రమార్కుని కోరారు. 2019లో సుమారు నాలుగు లక్షల రూపాయల ఖర్చుతో సొంత స్థలంలో ఆయన ఈ వేదికను నిర్మించారు. ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రైతు వేదికను నాడు ప్రారంభించారు. నాటినుండి గ్రామ ప్రజలు పలు విధాలుగా ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలపాడు గోవిందాపురం ఎంపీటీసీ శ్రీమతిపారా శ్రీదేవి అల్లపాడు గోవిందాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## విజయబాబు ను ఉద్యోగం నుంచి తొలగించకపోతే విధులు బహిష్కరిస్తాం

**తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి**



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** పెండింగ్ లో ఉన్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులక వేతనాలు ఇవ్వాలని అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని అదనపు సానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబుని ఉద్యోగం నుంచి తొలగించాలని లేకుంటే విధులు బహిష్కరిస్తామని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం డిఆర్వో డి పద్మజరాణి ను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని గత కమిషనర్ సుజాత, హెల్త్ అసిస్టెంట్ గా ఉన్న కమీషనర్ కు కొన్ని అనుకూలంగా పనులు చేయడంతో మున్సిపల్ కమిషనర్ ఎసుజాత హెల్త్ అసిస్టెంట్ గా ఉన్న విజయబాబుకు శానిటరీ ఇన్స్పెక్టర్ పోస్టింగ్ ఇవ్వడం జరిగింది విజయ బాబు వచ్చిన తర్వాత గత 20 సంవత్సరాల నుండి సంగారెడ్డి మున్సిపల్ లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను 19 మంది కార్మికులను నోటీసులు ఇవ్వకుండా తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, శ్రీనివాస్, రాజు సంగీత నర్సింలు, లక్ష్మీనారాయణ, యాదగిరి రాజేష్ మల్లేశం సంగీత బాలవాని, మల్లేశం మల్లేశం, అమృతమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం విఫలం




**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** రైతులపై నిర్బంధకాండను వెంటనే ఆపాలి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి నల్ల చట్టాలను రద్దుచేసి రైతులకు కనీస మద్దతు ధరను వెంటనే ప్రకటిస్తూ చట్టం తీసుకురావాలి, ఢిల్లీలో మోడీ ప్రభుత్వం రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ ఖాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ.. రైతాంగం పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతాంగానికి వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ వెళ్తున్న హర్యానా,పంజాబ్,ఇతర రాష్ట్రాల రైతులపై ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో మోడీ ప్రభుత్వం పోలీసులతో రైతులపై లాటిఛార్జ్ చేయడం, కాల్పులు జరపడం, బాష్ప వాయువులు ఉపయోగించడం వల్ల ఇప్పటికే ఇద్దరు రైతులు చనిపోయారని వందలాదిమంది క్షతగాత్రులు కాబడ్డారని ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న మోడీ రైతులకు గత పోరాటంలో ఇచ్చిన హామీ ప్రకారమైన వెంటనే మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఎస్ కె ఎస్ ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ ఖాన్ సీనియర్ నాయకులు వజీర్ బేగ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ముస్తఫా నర్సింలు సాధకలి సంజీవరెడ్డి మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుబీనా బేగం ఆర్ లక్ష్మి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

**జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** గత కొన్ని రోజులుగా జిల్లాలో, పొరుగు జిల్లాల లో చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని కొన్ని వదంతులు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది అమాయక ప్రజలను కొడుతున్నారని, కావున సంగారెడ్డి జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా.. ఎవరైన చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానం వచ్చినట్లైతే, అట్టి వ్యక్తులను పట్టుకొని 100 డైల్ కానీ, సమీప పోలీసు స్టేషన్ కు గాని సమాచారం అందించాలని సూచించారు. కానీ కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానంతో అమాయక ప్రజలను కొట్టి, ఇబ్బందులకు గురిచేసి, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలుంటాయని తెలియజేశారు.

## దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సంక్షేమ పథకాలకు అధ్యులు ఎన్టీఆర్

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**



**వాస్తవ నేస్తం,కోటగిరి:** కులాలకు మతాలకు అతీతంగా ప్రజా రంజక పాలన విధానంతో ఎదిగిన మహానీయులు,నేడు దేశవ్యాప్తంగా కొన సాగుతున్న సంక్షేమ పథకాలకు అధ్యులు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.సోమవారం కోటగిరి మండల కేంద్రంలోని మిర్జాపూర్ క్యాంప్లో ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణలో విగ్రహ విష్కకర్తగా ఆయన పాల్గొని విగ్రహాన్ని ప్రారంభించారు.ఈ సందర్భం గా పలువురు అతిథులు మాట్లాడుతూ.ప్రాంతీయ పార్టీ నినాదంతో జాతీయ పార్టీలకు సెగ పుట్టించిన మహనీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు.నట సార్వభౌమ స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహన్నీ కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటే శ్వరరావు,బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,జెహిరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి,సీనియర్ నాయకులు రమాదేవి,యలమంచిలి శ్రీనివాస్ రావు,ఎంపీపీ వల్లేపల్లి సునీత శ్రీనివాస్,ఎంపీటీసీ లు కరిమాభి,పార్వతి గంగాధర దేశాయ్,కొట్టం మనోహర్,సింగిల్ విండో చైర్మన్లు కూచి సిద్దు,డా. సునీల్ కుమార్,తాజా మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, ఎన్టీఆర్ విగ్రహా విగ్రహ నిర్వాహకులు దుప్పల పూడి శ్రీధర్ బాబు,కొల్లూరు రమేష్ బాబు,వేములపల్లి ఆనంద్ కుమార్,దమ్మలపాటి ఉదయ భాస్కర్, వేములపల్లి రాజ్ కుమార్,నార్ల సాయి శ్రీనివాస్, వేములపల్లి కృష్ణా రావు,డి. చౌదరి,ఎత్తొండ నాగులు,వల్లేపల్లి పెద్ద శ్రీనివాస్,పుప్పాల శంకర్,వడ్ల మూడి రాధాకృష్ణ,ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## వైరా అసిస్టెంట్ మోటారు వాహన అధికారిని సన్మానించిన నాయకుడు



**వాస్తవనేస్తం,వైరా:** అసిస్టెంట్ మోటారు వాహన అధికారిగా భాధ్యతలు స్వీకరించిన వరప్రసాద్ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రవాణా శాఖ వైరా యూనిట్ కార్యాలయంలో కలిసి అధికారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐఖ్యవేదిక నాయకులు కంకణాన అర్జునరావు సంపసాల వరదరాజు ఓర్సు శ్రీనివాస రావు శ్రీ నల్లగట్ల బాబు పూర్ణకంటి రామ రావు తదితరులు పాల్గొన్నారు.

# మరో భారీ బహిరంగసభకు గులాబీ దళం ప్లాన్

హైదరాబాద్ : తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 2023లో ఓడిపోయింది. కాదు కాదు.. ప్రజలు ఓడించారు. పదేళ్ల కుటుంబ పాలన, అహంకారపూరిత పాలన, ప్రజలను పట్టించుకోకపోవడం, ఏపీలో కంటే.. తెలంగాణ వచ్చాకే నేతల దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు పెరగడం, అంతులేని అవినీతి, వారికి పాలకుల వత్తాసు పలకడం వంటి అనేక కారణాలు బీఆర్ఎస్ ఓటమిలో కీలక పాత్ర పోషించాయి. కేవలం 38 సీట్లకే పరిమితం చేశారు. ఇక త్వరలో లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ బలోపేతంపై ఆ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టిపెట్టారు. అధికారం కోల్పోయాక వారికి ప్రజలు, ప్రజా సమస్యలు గుర్తొస్తున్నాయి. అధికారం లో ఉన్నప్పుడు రాజు, యువరాజు, మంత్రి, అన్నట్లుగా పాలన సాగించారు. రాచరికపు పోకడలతో ప్రజలకు విసుగు తెప్పించారు. నిరుద్యోగులతో చెలగాటం ఆడారు. హామీలు మర్చిపోయా రు. డబ్బులు చల్లితే ఓట్లు పడతాయన్న అహంకారంతో ఎన్నికల్లో విచ్చల విడిగా డబ్బులు ఖర్చు చేశారు.అధికారంలో ఉన్నప్పుడు నీళ్ల వాటా తేల్చకుండా.. పాత ఒప్పందాలకే పరిమితమైన గులాబీ నేతలకు ఇప్పుడు నీటి సమస్య గుర్తొచ్చింది. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం పోరుబాట పట్టాలనుకుంటున్నారు. ఇందుకోసం కేటీఆర్, హరీశ్‌రావు పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. నాగార్జున సాగర్ నుంచి ఒకరు. కాళేశ్వరం నుంచి మరొకరు యాత్ర చేపడతారని సమాచారం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీటి విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఉత్తర తెలంగాణకు లక్ష కోట్ల ఖర్చు చేసి దక్షిణ తెలంగాణను ఎలా ఎడారిగా మార్చింది అన్న విషయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఎండగడుతోంది. దీనిని సమాధానం చెప్పలేక గులాబీ నేతలు ఎదురు దాడి చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్ నేతల మాటలు ఎవరూ నమ్మడం లేదు. దీంతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని భావిస్తున్నారు.మొన్నటి అసెంబ్లీ ఎన్నిలక ఓటమి, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎదురు కాకుండా ఉండడంతోపాటు ప్రజా సమస్యలపై పోరాటం చేశామన్న



క్రెడిట్ కోసం గులాబీ నేతలు పాదయాత్ర ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తరహాలో లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఓడిపోతే పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పటికే చాలా మంది గులాబీ నేతలు అధికార కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాలు గెలవకపోతే.. పార్టీ ఖాళీ అవుతుందన్న భావన గులాబీ ముఖ్య నాయకుల్లో నెలకొంది. దీంతో పార్టీని కాపాడడం, ప్రజా సమస్యలపై పోరాడామని అనిపించు కోవడం, లోక్‌సభ ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా బావ, బావమర్దులు ఈ పాదయాత్ర ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బీఆర్ఎస్ నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహించిన తొలి సభ సక్సెస్ కావడంతో అదే ఊపును పార్లమెంటు ఎన్నికల వరకు కొనసాగించాలని చూస్తున్నారు. ఈ క్రమం లోనే బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనమధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించడంతోపాటు నీటివాటాలో జరుగుతున్న నష్టాన్ని తెలంగాణ సమాజం దృష్టికి తీసుకెళ్లాలనుకుం టున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మరో సభ పెట్టేందుకు కూడా ప్లాన్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే సభ నిర్వహించి పాదయాత్ర మొదలు పెట్టాలని భావిస్తున్నారు. కృష్ణా జలాల అంశాన్నే బీఆర్ఎస్ ప్రధాన అంశంగా ఎత్తుకో బోతోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించ లేదని, కాంగ్రెస్ వచ్చాక అప్పగిం చాలని చూస్తోందని ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే తెలంగాణకు అన్యాయం చేస్తోందని ప్రజల ముందు దోషిగా చూపాలని భావిస్తోంది. తెలంగాణ ప్రజల సమస్యలపై కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ప్రమోట్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి ఈ ప్రయత్నం ఎంతమేరకు ఫలిస్తుందో చూడాలి.

## వాంబే కాలనీలో పాదయాత్ర చేసిన కార్పొరేటర్



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో డ్రైనేజీ లైన్ సమస్యగా ఉందని కాలనీ వాసులు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, కార్పొరేటర్, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ తో కలిసి వాంబే కాలనీలో పర్యటించి పాదయాత్ర చేస్తూ సమస్యలను నేడు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వాంబే కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. వాంబే కాలనీకి ఇప్పటికే నూట అరవై మీటర్ల డ్రైనేజీ లైన్ సంక్షన్ అయ్యి ఉందని, నిర్మాణ పనులు అతి త్వరలో మొదలుపెడతారని అన్నారు. ఈ నూట అరవై మీటర్ల కాకుండా కాలనీకి ఇంకా ఎంత మేరకు డ్రైనేజీ లైన్ అవసరం పడుతుందో ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు పాండుగౌడ్, వెంకటేష్, వేణు గోపాల్, నరసింహ, వేణు, శ్రీకాంత్, ముస్తఫా, రమణ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా అయోధ్య యాత్ర ముగింపు



**వాస్తవ నేస్తం,కోటగిరి:** జహీరాబాద్ పార్లమెంట్ బాన్సువాడ నియోజకవర్గం నుంచి అయోధ్యకు వెళ్ళిన రామ భక్తులు అయోధ్య యాత్ర పూర్తి చేసుకుని తిరిగి బాన్సువాడకు వచ్చారు. ఈ సందర్బంగ పోతంగల్ మండల ప్రధాన కార్యదర్శి , పబ్బ శేఖర్, మాట్లాడుతూ.. అయోధ్యకు వెళ్ళిన రామ భక్తులకు, భోజన సదుపాయం, అకామిడేషన్ సదుపాయలు, యూపీ ప్రభుత్వం. అన్ని తానై, అక్కడికి వచ్చిన భక్తులకు,ఏలాంటి లోటు పాటలు లేకుండా, అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని సంతోషం వ్యక్తం పరుస్తూ, యూపీ ప్రభుత్వానికి,యూపీ పోలీసులకు ధన్యవాదాలు తెలుపడం జరిగింది... అదేవిధంగా బాన్సువాడ నియోజకవర్గ రామభక్తులు కోచ్ ఇంచార్జ్ పబ్బ శేఖర్ గారిని చిరు సన్మానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో ధనంజయ్ అంకుష్ పవర్, జగదీష్, సంజీవ్ లక్ష్మణ్ దేవదాస్ తదితర రామ భక్తులు పాల్గొన్నారు...

## నిర్లిప్తంగా గులాబీ శ్రేణులు

**హైదరాబాద్ :** పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ మార్చి పదో తేదీలోపు రానుంది. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మొదటి విడతలోనే జరుగుతుంది. అయినా భారత రాష్ట్ర సమితి లో నిర్లిప్తత కనిపిస్తోంది. అభ్యర్థుల ఎంపిక.. ఎన్నికల వ్యూహంపై అసలు ఎలాంటి కసరత్తు చేయడం లేదు. కీలకమైన సమయంలో కేసీఆర్ ఫామ్ హౌస్‌కు పరిమితం కాగా కేటీఆర్ విదేశీ పర్యటనకు వెళ్లారు. నల్లగొండలో నిర్వహించిన కృష్ణా జలాల హక్కుల సాధన, కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై జరిగిన బహిరంగ సభ తర్వాత వరుస కార్యక్రమాలు పెడతారని అనుకున్నారు. కానీ మళ్లీ ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయలేదు. హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ అని.. కేటీఆర్, హరీష్ పాదయాత్ర అని పార్టీ వర్గాల నుంచి లీకులు వస్తున్నాయి కానీ.. ఎన్నికల షెడ్యూల్ వస్తే ఇలాంటి వాటికి అవకాశం ఉండదు. కేసీఆర్ ఇప్పటి వరకూ వ్యక్తిగతంగా పార్లమెంట్ ఎన్నికల కోసం కసరత్తు చేశారేమో కానీ.. ప్రత్యేకంగా పార్టీ నేతలతో ఎలాంటి సమీక్షలు చేయలేదు. మూడు నాలుగు పార్లమెంటు సెగ్మెంట్లపై సమీక్షా సమావేశాలు, పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆరెస్ ఎంపీలకు మార్గనిర్దేశం చేయడం మినహా అంత సీరియస్‌గా లేరనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ నాయకత్వం రాష్ట్రంలో 17 పార్లమెంటు నియోజకవర్గాలకు ఆశావహులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి, వాటిని పరిశీలించి ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిటీకి పంపించింది. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఏ రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని ప్రజలకు పరిచయం చేశారు. పార్లమెంటు స్థానాలవారీగా కాంగ్రెస్ నాయకత్వం మంత్రులకు ఇప్పటికే బాధ్యతలు అప్పగించింది. మొత్తం 17 స్థానాలకుగాను కనీసం 14 స్థానాలను దక్కించుకోవాలని పార్టీ నాయకత్వం వ్యూహరచన చేస్తున్నదని సమాచారం. ఇప్పటికే అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా మంత్రులు సమీక్షలు నిర్వహించి, కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుకున్న విజయం కాకపోయినా ఎనిమిది అసెంబ్లీ సీట్లను గెల్చుకున్న బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో కూడా సత్తా చాటాలని భావిస్తున్నది. ఆ మేరకు రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేసింది. విజయ సంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డి, ఎంపీ బండి సంజయ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విజయ సంకల్ప యాత్రల ద్వారా ఓటు బ్యాంకు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఆరెస్‌తోపాటు కాంగ్రెస్ పార్టీపై విమర్శల దాడి ఎక్కుపెడు తున్నారు. బీజేపీతో పొత్తు కోసం బీఆరెస్ తన శక్తియుక్తులను ప్రయోగిస్తున్నదన్న ప్రచారం జరుగుతోంది. కానీ బీజేపీ వైపు నుంచి సానుకూల సంకేతాలు రావడం లేదు. ఈ పొత్తుల అంశం ప్రచారంలోకి రాగానే ఎంపీ బండి సంజయ్ ఆగ్రహంతో ఊగిపోయారు. రెండు రోజుల క్రితం జరిగిన విజయ సంకల్పయాత్రలో సంజయ్ మాట్లాడుతూ, బీఆరెస్‌తో పొత్తు ఉండదని, పొత్తు ఉంటుందని ఎవరైనా అంటే చెప్పులతో కొట్టండని చెప్పారు. అక్కడితో ఆగకుండా.. సభలో పాల్గొన్న కార్తకర్తలు, ప్రజలు చెప్పులు ఎత్తి చూపించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పొత్తుల ప్రచారం జరగడం వల్ల బీజేపీ, బీఆరెస్ ఒక్కటేననే బలమైన ప్రచారం జరుగుతోందని దాని వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని బండి సంజయ్ భావిస్తున్నారు. దాని నుంచి నుంచి బయటపడటానికి ఇప్పుడు కాషాయ రాష్ట్ర నాయకులు ప్రయత్నిస్తూంటే తాజాగా పొత్తుల అంశం ప్రచారంలోకి వచ్చింది.

# వై నాట్ 14 అంటున్న కాంగ్రెస్

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాల్‌గా మారబోతున్నాయి వచ్చే లోక్‌సభ ఎన్నికలు. అసెంబ్లీ ఎన్నికల్లో పవర్‌లోకి వచ్చిన పార్టీ.. పార్లమెంట్ ఎలక్షన్స్‌లో మెజార్టీ సీట్లు సాధించి పట్టు తగ్గలేదని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధిష్టానం కూడా కనీసం 14 సీట్లు అయినా గెలవాలని టి కాంగ్రెస్ నేతలకు టార్గెట్ పెట్టినట్టు తెలిసింది. ఆ క్రమంలోనే పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రతి సభలోను 14 ఎంపీ సీట్లంటూ ప్రస్తావిస్తోంది. తెలంగాణలో మొత్తం 17 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. మామూలుగా అయితే ఏ పార్టీ నేతలైనా.. ఆ ఊపులో చెప్పేటప్పుడు అన్ని సీట్లు గెలుచుకుంటామని అంటారు. కానీ, తెలంగాణ కాంగ్రెస్ మాత్రం 14కే ఎందుకు ఫిక్స్ అయింది? అంటే మిగతా మూడు సీట్లలో గెలవలేమని ముందే ఫిక్స్ అయ్యారా?లేదంటే వాస్తవానికి దగ్గరగా మాట్లాడాలని అనుకుంటున్నారా అన్న చర్చ జరుగుతోంది. అదే సమయంలో ఆ వదిలేసిన మూడు సీట్లు ఏవన్న ప్రశ్న కూడా వస్తోంది పార్టీ వర్గాల్లో. ఓపెన్‌గా మాట్లాడుకుంటే? తెలంగాణలోని ఏ రాజకీయ పార్టీ అయినా? హైదరాబాద్ లోక్‌సభ సీటుకు అంత త్వరగా తమ లెక్కలోకి తీసుకోవు. అక్కడ ఎంఐఎంకి ఉన్న బలం దృష్ట్యా దాన్ని వదిలేసి చెబుతుంటాయి.పార్లమెంట్ ఎన్నికల టైంలో బీఆర్ఎస్ కూడా సారు, కారు, పదహారు అన్న నినాదాన్ని ఇచ్చిందే తప్ప 17 అనలేదు. ఆ సంగతి అలా ఉంచితే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ 16 అని కూడా అనకుండా 14కే ఎందుకు ఫిక్స్ అయిందన్న



ప్రశ్నకు సమాధానం వెదుకుతున్నాయి రాజకీయ వర్గాలు. అలాగే మిగిలిన రెండు సీట్లు ఎవరికి వెళ్తాయని కాంగ్రెస్ భావిస్తోందన్న చర్చ సైతం జరుగుతోంది. ఈసారి బీఆర్ఎస్ ఒకటి లేదా రెండు సీట్లకే పరిమితం అవుతుందని తొలి నుంచి జోస్యం చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు. అటు బీజేపీ కూడా డబుల్ డిజిట్ టార్గెట్ అంటున్నా.. తక్కువలో తక్కువ ఐదారు ఎంపీ సీట్లు గెలుస్తామన్న ధీమాతో ఉంది. ఈ పరిస్థితుల్లో ఎవరెన్ని సీట్లు గెలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి జాతీయ పార్టీల మధ్యనే పోటీ ఎక్కువ అన్నది మెయిన్ పాయింట్. అయినా కాంగ్రెస్ కనీసం 17కు పదహారు అనైనా అనకుండా 14 ఫిగర్‌కు ఫిక్స్ అవడం వెనక వాస్తవికత ఉందా.. లేక మొత్తం ఫిగర్ చెప్పడానికి ధైర్యం చాలడం లేదా అన్నది ఓపెన్ టాక్. ఈ పరిస్థితుల్లో తెలం గాణలో ఎంపీ సీట్ల చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోంది. జాతీయ పార్టీలతో పాటు బీఆర్ఎస్ కూడా మా వ్యూహాలు మాకున్నాయంటూ భారీగానే ఆశలు పెట్టుకుంది. చివరికి ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో చూడాలి.

# ఆగని పోకిరీలు .. శృతిమించుతున్న ఆగడాలు

**హైదరాబాద్ :** పార్కుల్లో కాస్త చాటు ప్రాంతం కనిపిందంటే పోకిరీలు చెలరేగిపోతున్నారు. చెట్లు, పుట్ట, గట్టు సహా సాధారణ ప్రజలు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీలను సైతం వదిలిపెట్టడం లేదు. పట్టపగలు బహిరంగ ప్రదేశాల్లో అసభ్య ప్రవర్తిస్తూ..అందరికీ ఇబ్బంది కలిగిస్తున్నారు. హైదరాబాద్ లోని ఇందిరాపార్కు, పబ్లిక్ గార్డెన్, దుర్గం చెరువు వంటి ప్రాంతాల్లో వీరి తాకిడి ఎక్కువగా ఉంది. ఇప్పుడు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలోనూ వీరి ఆగడాలు శృతిమించుతున్నాయి. ఇలాంటి వారి పట్ల హైదరాబాద్ పోలీసులు నిఘా పెట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే పోకిరీలపై నిఘ కొనసాగుతుంది. వారి అసభ్య ప్రవర్తనను రికార్డు చేసి అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. హైదరబాద్ లో పోకిరీల ఆగడాలు శృతిమించుతున్నాయి. ఆడపిల్లలు,మహిళలు ఒంటరిగా కనిపిస్తే వేధించడం, వెంటపడి ఏడిపించడం ఎక్కువయ్యాయి. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లోనే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. ఇలాంటి వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టిన హైదరాబాద్ పోలీసు?ల...రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలలో మహిళలు, యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే పోకిరీలను ఓ కంట కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులను చూస్తే వారు ఒక్కసారిగా పారిపోయే ప్రమాదముందని గ్రహించిన వారు..చాటుగా వారు చేసే అసభ్య ప్రవర్తనను రికార్డు చేయిస్తున్నారు. ఆ తర్వాత వివరాలు కనుక్కుని అరెస్ట్ చేస్తున్నారు. తప్పు చేసిన వారు తప్పిచుకోకుండా వీడియో సాక్ష్యం ఉంటుందని హైదరాబాద్ మహిళా సేఫ్టీ డీసీపీ కవిత తెలిపారు. ఇప్పటికే ఇలాంటి వారిని 12 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించామన్నారు. కోర్టు ఆధారాలన్నీ పరిశీలించి వారికి జరిమానా విధించింద న్నారు. షీ టీమ్ నిరంతరం మహిళా రక్షణ కోసం పని చేస్తుందని, ఇబ్బందులుంటే వెంటనే షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని ఆమె సూచించారు. మహిళలను వేధిస్తున్న ఫిర్యాదులు ఇటీవల కాలంలో భాగా పెరిగిపోతున్నా యని డీసీపీ కవిత తెలిపారు. యువతులను కాదు మహిళ లను సైతం పోకిరీలు వేధిస్తున్నారని ఆమె వివరించారు. ముఖ్యంగా లేడిస్ హాస్టళ్లు, కళాశాలకు వెళ్లి వచ్చే దారులు, శివారు బస్టాండ్లల్లో వేధింపులు ఎక్కువయ్యాయన్నారు.అందుకే ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని వివరించారు. పని ప్రదేశాల్లోనూ



తోటి ఉద్యోగుల నుంచి ఏమైనా ఇబ్బందులు ఉంటే మహిళలు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కొందరు మహిళలు పరువు పోతుందని..ఆ తర్వాత వేధింపులు మరింత ఎక్కువ అవుతాయని భావించి బయటకు చెప్పుకోలేకపోతున్నారని... అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆమె హామీ ఇచ్చారు. అటు యువకుల తల్లీదండ్రులను సైతం పోలీసులు హెచ్చరించారు.తమ బిడ్డల ప్రవర్తనపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కుంటే వారి బంగారు భవిష్యత్ నాశనమవుతుందని తెలిపారు. ఇంటి నుంచే పిల్లల్లో మార్పు రావాలన్నారు. అలాగే మైనర్లు ఇష్టానుసారం బైకులపై చక్కర్లు కొడుతూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారని..అలాంటి వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని హైదరాబాదా పోలీసులు హెచ్చరించారు. పోకిరీలు ఇప్పటికైనా పద్దతి మార్చుకోవాలని డీసీపీ కవిత హెచ్చరించారు.

# టాప్ 8 సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.1 లక్షల కోట్లు లబ్ధి

గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్-10 సంస్థల్లో ఎనిమిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,10,106.83 కోట్లు పెరిగింది. వాటిలో రిలయన్స్ ఇండిస్ట్రీస్ భారీగా లబ్ధి పొందింది. గతవారం బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 716.16 పాయింట్లు (0.97 శాతం) పెరిగింది. రిలయన్స్ ఇండిస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) భారీగా లబ్ధి పొందాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ సంయుక్తంగా రూ.38,477.49 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయాయి.రిలయన్స్ ఇండిస్ట్రీస్ ఎం-క్యాప్ రూ.43,976.96 కోట్లు పుంజుకుని రూ.20,20,470.88 లక్షల కోట్లకు చేరుకున్నది. శుక్రవారం రిలయన్స్ షేర్ తాజా 52 వారాల గరిష్ట స్థాయి రూ.2,996.15లకు దూసుకెళ్లింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.27,012.47 కోట్లు పుంజుకుని రూ.7,44,808.72 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ.7,235.62 కోట్లు పెరిగి రూ. 6,74,655.88 లక్షల కోట్లకు పెరిగింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ. 8,548.19 కోట్లు పెరిగి రూ.5,13,640.37 కోట్ల వద్ద స్థిర పడింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4,534.71 కోట్లు పెరిగి రూ.5,62,574.38 కోట్ల వద్ద




ముగిసింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4,149.94 కోట్లు పెరిగి రూ. 6,77,735.03 కోట్లకు చేరుకున్నది. తద్వారా ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్థానాన్ని ఎస్బీఐ అధిగమించింది. దీంతో దేశంలోనే టాప్-5 కంపెనీల్లో ఒకటిగా ఉందని బీఎస్ఈ తెలిపింది. ఇక భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,855.73 కోట్లు పెరిగి, రూ.6,34,196.63 కోట్ల వద్ద స్థిర పడింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.793.21 కోట్లు పెరిగాయి.

## ఎఆర్‌సిలకు రూ.1.6 లక్షల కోట్ల ఎన్‌పిఎలు




**న్యూఢిల్లీ:** బ్యాంక్‌లు, విత్త సంస్థలు తమ మొండి బాకీలను వసూలు చేయలేక అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎఆర్‌సి)లకు అప్పగించే ఆస్తులు పెరగొచ్చని రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్, పారిశ్రామికవేత్తల సంఘం అసోచామ్ సంయుక్త నివేదికలో అంచనా వేశాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఎఆర్‌సిల ఎయుఎం 8-9 శాతం పెరిగి రూ.1.5 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25 ముగింపు నాటికి మరో 5-8 శాతం పెరిగి రూ.1.6 లక్షల కోట్లుగా నమోదయ్యే అవకాశాలున్నాయి. 2023 మార్చి నాటికి ఎఆర్‌సిలకు చేరిన మొండి బాకీల ఆస్తుల విలువ రూ.1.38 లక్షల కోట్లుగా ఉంది. ఇవి ప్రతీ ఏడాది పెరుగుతూ పోవడం బ్యాంక్‌ల్లో కలవరాన్ని కలిగిస్తోంది.2022-23లో ఈ రంగం ఏకంగా 17 శాతం ఎగిసిందని క్రిసిల్‌అసోచామ్ రిపోర్ట్ తెలిపింది. ఆ ఏడాది బ్యాంక్‌ల నుంచి బడా ఎన్‌పిఎ పద్దులు ఎఆర్‌సికి చేరాయి. 2017-18 మార్చి ముగింపు నాటికి బ్యాంకింగ్ రంగంలో ముఖ్యంగా కార్పొరేట్లకు సంబంధించిన స్థూల నిరర్థక ఆస్తులు భారీగా చోటు చేసుకున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌బిఎఫ్‌సిలు, రియల్ ఎస్టేట్ ఫైనాన్స్ రంగాలు అధిక ఒత్తిడికి గురైయ్యాయి. రాబోయే రోజుల్లో కార్పొరేట్ల ఎన్‌పిఎల్లో కొంత తగ్గుదల చోటు చేసుకోవచ్చని క్రిసిల్ అంచనా వేసింది.

## 'రెరా'పై జీఎస్‌టీ మినహాయింపు




**న్యూఢిల్లీ:** స్థిరాస్థి నియంత్రణ సంస్థ వస్తు సేవల పన్ను చెల్లించాల్సిన అవసరం లేదనే అంశంపై జీఎస్‌టీ మండలి త్వరలో స్పష్టతనిస్తుందని ఓ ప్రభుత్వాధికారి తెలిపారు. రెరా పనితీరును సమీక్షించిన తర్వాత వారికి జీఎస్‌టీ వర్తించదనే నిర్ధరణకు వచ్చినట్లు పేర్కొన్నారు. మరోవైపు 'రెరా'లకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తున్నాయని గుర్తుచేశారు. వీటిపై జీఎస్‌టీ వేస్తే అది రాష్ట్ర ప్రభుత్వాలపై పన్ను విధించినట్లు అవుతుందని వివరించారు. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడానికి ముందే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జీఎస్‌టీ మండలి సమావేశం జరిగే అవకాశం ఉంది. 2023 అక్టోబర్ 7న చివరి భేటీ జరిగింది. 2022 జులై 18కి ముందు ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏ, జీఎస్‌టీ నెట్‌వర్క్, ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి నియంత్రణ సంస్థలు అందించే సేవలకు జీఎస్‌టీ వర్తించేది కాదని మూర్ సింఘీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రజత్ మోహన్ వెల్లడించారు. తర్వాత దాన్ని ఎత్తివేయడంతో రెరా వంటి వాటిపై దాని ప్రభావం గురించి చర్చ మొదలైంది. 'రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ సెక్టార్‌లో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కి అనుమతి లేదు. అంటే రెరాను జీఎస్‌టీ నుంచి మినహాయించడం వల్ల డెవలపర్లు, గృహ కొనుగోలుదారులకు ఖర్చులు తగ్గుతాయి. ఈ విషయంపై జీఎస్‌టీ మండలి సానుకూల నిర్ణయం స్థిరాస్తి రంగానికి ప్రయోజనాన్ని చేకూరుస్తుంది" అని మోహన్ వివరించారు.

## మూడో వారమూ సానుకూలంగానే

భారత స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో వారమూ సానుకూలతలను కొనసాగించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.'పడ్డపుడల్లా కొనుగోలు' చేయడం మంచి వ్యూహమవుతుందని సూచిస్తున్నారు. నిఫ్టీ-50 పలుమార్లు తాజా గరిష్ఠాలను చేరొచ్చని సాంకేతిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. నిఫ్టీకి 22,000 వద్ద మద్దతు, 22,500 వద్ద నిరోధాన్ని అంచనా కడుతున్నారు. 22,000 పైన కదిలినంత కాలం బులిష్ ధోరణి కొనసాగొచ్చని చెబుతున్నారు. ఆరో వారమూ ఫార్మా షేర్లు రాణించొచ్చని భావిస్తున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..పెద్దగా వార్తలేమీ లేకపోవడంతో సిమెంటు షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. అల్ట్రాటెక్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్‌పై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు.లోహ కంపెనీల షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది. అయితే కొంత ఊగిసలాటలకూ అవకాశం ఉన్నా.. మొత్తం మీద బులిష్‌గానే ఉండొచ్చు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జిందాల్ స్టీల్, టాటా స్టీల్ షేర్లను గమనించొచ్చు.ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు ముందుకే వెళ్లవచ్చు.




లాభాల స్వీకరణా జరగొచ్చు. హిందుస్థాన్ యునిలీవర్, టాటా కన్స్యూమర్, వరుణ్ బేవరేజెస్‌లపై దృష్టి పెట్టవచ్చు. ఐటీసీ షేరు పుంజుకుని మళ్లీ రూ.420కు చేరొచ్చు. ఐటీ కంపెనీల షేర్లు సానుకూల ధోరణితో ట్రేడవవచ్చు. నిఫ్టీ ఐటీ 37,250-38,450 మధ్య చలించొచ్చు. టీసీఎస్ స్వల్పకాలంలో రాణించొచ్చు. అంతర్జాతీయ స్థూల ఆర్థిక కార్యకలాపాలపై మదుపర్లు ఓ కన్నేయాల్సి ఉంటుంది. బ్యాంకు షేర్లు ఒత్తిడిలో కనిపించొచ్చు. బ్యాంక్ నిఫ్టీకి 46,500 వద్ద కీలక మద్దతు లభించొచ్చు. ఆ స్థాయి దిగువను మరింత విక్రయాలు చోటు చేసుకోవచ్చు. 47,000 పైకి వెళితేనే బులిష్ ధోరణికి అవకాశం ఉండొచ్చు.వాహన రంగ షేర్లకు లాభాల స్వీకరణ ఎదురుకావొచ్చు. వరుసగా నాలుగు వారాల పాటు నిఫ్టీ వాహన సూచీలో ర్యాలీ కనిపించడం ఇందుకు నేపథ్యం. మారుతీ రూ.11,400, మహీంద్రా రూ.1,910కు వస్తే కొనుగోలుకు అవకాశంగా భావించొచ్చు.ఫార్మా షేర్లు వరుసగా ఆరో వారమూ పరుగులు తీసి తాజా గరిష్ఠాలకు చేరొచ్చు. అయితే అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ జరగొచ్చు. సిప్లా, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్‌పై ఓ బ్రోకరేజీ సంస్థ బులిష్‌గా ఉంది. యంత్రపరికరాల కంపెనీ షేర్లు ఊగిసలాటకు గురికావొచ్చు.

# దూకుడు పనికిరాదని మొత్తుకున్నా విన్లే.. బజ్‌బాల్‌కు భారత్‌లో తొలి దెబ్బ




టెస్టులు ఆడే విధానాన్ని మారుస్తున్నామంటూ చెప్పుకుంటూ స్వదేశంతో పాటు విదేశాల్లోనూ నానా హంగామా చేస్తున్న 'బజ్‌బాల్' టీమ్‌కు భారత్‌లో ఎదురుదెబ్బ తప్పలేదు. సుమారు రెండేండ్లుగా తాము పట్టిందల్లా బంగారమే అన్నట్టుగా వచ్చిన విజయాలకు రోహిత్ శర్మ సారథ్యంలోని కుర్రాళ్లు ఓటమి రుచి చూపించారు. తోపు క్రికెటర్లు ఉన్న ఇంగ్లండ్‌కు.. మీ ఆటలు ఇక్కడ సాగనివ్వం అని చెప్పకనే చెప్పారు. ఓటమన్నదే లేకుండా దూసుకుపోతున్న బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ ద్వయానికి, ఇంగ్లండ్ క్రికెట్ జట్టుకూ ఆత్మపరిశీలన అవసరమనేలా స్టేట్‌మెంట్ ఇచ్చారు. దూకుడుగా ఆడటమే కాకుండా పరిస్థితులకు తగ్గట్టు ఆడితేనే టెస్టులలో ఫలితాలు వస్తాయని నిరూపించింది కుర్ర భారత్..

**అప్పుడు మొదలైంది..**

ఐపీఎల్ - 2022 తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ కోచింగ్ బాధ్యతలను వదిలిపెట్టిన మెక్‌కల్లమ్.. ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కోచ్‌గా వెళ్లాడు. అప్పటికీ ఇంగ్లండ్.. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ఓటమితో పాటు వెస్టిండీస్ మీద కూడా ఓడి దారుణ విమర్శలు ఎదుర్కొంటుంది. దీంతో నాటి సారథి జో రూట్ తన బాధ్యతలను వదిలేయడంతో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ).. బెన్ స్టోక్స్‌కు ఆ పగ్గాలు అప్పజెప్పింది. మెక్‌కల్లమ్ %--% స్టోక్స్‌ల తొలి సవాల్ స్వదేశంలోనే. న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ క్లీన్ స్వీప్ చేసింది. అప్పుడు మొదలైంది ఈ బజ్‌బాల్ కథ. నాటి నుంచి నేటి రాంచీ టెస్టు దాకా ఎక్కడికెళ్లినా బజ్‌బాల్.. బజ్‌బాల్.. బజ్‌బాల్..

**అప్రతిహాత విజయాలు..**

కివీస్‌పై సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడంతో ఇంగ్లండ్‌పై ప్రశంసలు ముంచెత్తాయి. ఆ తర్వాతే ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్‌తో రీషెడ్యూల్డ్ టెస్టులోనూ టీమిండియా నిర్దేశించిన 375 పరుగుల ఛేదనను ఇంగ్లండ్ అలవోకగా ఛేదించింది. ఇదే ఊపులో స్వదేశంలోనే సౌతాఫ్రికాపై సిరీస్‌ను 2-1 తేడాతో గెలుచుకుంది. ఇక 2022 డిసెంబర్‌లో సుదీర్ఘకాలం తర్వాత పాకిస్తాన్ పర్యటనకు వచ్చిన ఇంగ్లండ్.. అక్కడ సంచలనాలు నమోదుచేసింది. రావల్పిండి టెస్టులో ఒక్కరోజే 500 ప్లస్ పరుగులు చేసిన స్టోక్స్ సేన.. ముల్తాన్ టెస్టులో ఆఖరి రోజు మరో రెండు ఓవర్లలో మ్యాచ్ ముగుస్తుందనగా ఆఖరి వికెట్ పడగొట్టి సంచలన విజయాన్ని అందుకుంది. అక్కడా మూడు మ్యాచ్‌లను గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. ఇదే క్రమంలో న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్టుల సిరీస్‌లో తలా ఒక మ్యాచ్ గెలవడంతో సిరీస్ డ్రా అయింది. గతేడాది స్వదేశంలో ఐర్లాండ్‌తో ఒక్క మ్యాచ్‌లో ఈజీగా గెలిచిన ఇంగ్లండ్.. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లో తొలి టెస్టులో ఓడినా తర్వాత పుంజుకుంది. ఈ సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకుంది.


## నా ఆత్మగౌరవం దెబ్బ తీశారు.. ఈ జన్మలో ఆ జట్టుకు ఆడను



భారత జట్టులో చోటు కోల్పోయిన క్రికెటర్ హనుమా విహారి మరో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఆంధ్రా క్రికెట్ జట్టును వీడేందుకు సిద్ధమయ్యాడు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తనను ఎంతో వేధనకు గురి చేసిందని, తన ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసిందని విహారి ఆరోపించాడు. అంతేకాదు ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఆడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. సోమవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో విహారి ఓ పోస్ట్ పెట్టాడు. అందులో పలు విషయాల గురించి అతడు ప్రస్తావించాడు. 'మేమెంతో పోరాడాం. ఆంధ్రా తరఫున మరో క్వార్టర్స్ ఓడిపోవడం చాలా బాధగా ఉంది. ఈ పోస్ట్ ద్వారా కొన్ని వాస్తవాలు మీ ముందు పెడుతున్నా. బెంగాల్‌తో ఫస్ట్ మ్యాచ్‌కు నేనే కెప్టెన్‌గా ఉన్నా. మ్యాచ్ సమయంలో 17వ ఆటగాడిపై అరిచాను. దాంతో, అతడు రాజకీయనాయకుడైన వాళ్ల తండ్రికి నాపై ఫిర్యాదు చేశాడు. ఆ పొలిటీషియన్ నాపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్‌పై ఒత్తిడి తెచ్చాడు. నా తప్పు ఏం లేకున్నా నన్ను కెప్టెన్‌గా వైదొలగమన్నారు. అయితే.. నేను ఉద్దేశపూర్వకంగా ఎవరినీ ఏమీ అనలేదు. కానీ, అసోసోషియేషన్ మాత్రం నాపై చర్యలు తీసుకుంది.

స్పోర్ట్స్


# తప్ప అందరూ సూపర్ హిట్.. ఐదో టెస్టులో ఉంటాడా?



స్వదేశంలో ఇంగ్లండ్‌ను మట్టికరిపించిన భారత జట్టు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలుండగానే టెస్టు సిరీస్‌ను చేజిక్కించుకుంది. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, పేసర్ మహ్మద్ షమీ, మిడిలార్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్‌లతో పాటు బుమ్రా, జడేజాలు ఒక టెస్టుకు దూరమైనా కుర్రాళ్ల అద్భుత ప్రదర్శనలతో సిరీస్‌ను 3-1 తేడాతో గెలుచుకుంది. ఈ సిరీస్‌లో భాగంగా భారత్‌కు రెండో టెస్టులో రజత్ పాటిదార్ అరంగేట్రం చేయగా రాజ్‌కోట్ టెస్టులో సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లు ఎంట్రీ ఇచ్చారు. నాలుగో టెస్టులో ఆకాశ్ దీప్ తన తొలి మ్యాచ్ ఆడాడు. నలుగురు ప్లేయర్లు అరంగేట్రం చేసినా వీరిలో రజత్ పాటిదార్ మినహా మిగిలిన ముగ్గురూ సూపర్ హిట్ అయ్యారు. కోహ్లీ గైర్హాజరీలో వైజాగ్ టెస్టులో ఎంట్రీ ఇచ్చిన రజత్.. తొలి ఇన్నింగ్స్‌లో 32 పరుగులు చేశాడు. ఈ ఒక్క ఇన్నింగ్స్ మినహా మిగిలిన ఐదు ఇన్నింగ్స్‌లలోనూ దారుణంగా విఫలమయ్యాడు. అదే టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 9 పరుగులే చేసిన పాటిదార్.. రాజ్‌కోట్ టెస్టులో ఐదు (5, 0) పరుగులే చేశాడు. ఇక నేడు ముగిసిన రాంచీ టెస్టులో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో 17 రన్స్ చేసిన రజత్.. రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్ అయి నిరాశపరిచాడు.


**ఆ ముగ్గురూ సూపర్ హిట్..**

రజత్‌ను మినహాయిస్తే సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్, ఆకాశ్ దీప్ మాత్రం అవకాశాలను అందిపుచ్చుకున్నారు. రాజ్‌కోట్ టెస్టులో సర్ఫరాజ్.. 62, 68 పరుగులతో రాణించాడు. ఇదే టెస్టులో జురెల్.. తొలి ఇన్నింగ్స్‌లో 46 రన్స్ చేయగా రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఇక రాంచీ టెస్టులో సర్ఫరాజ్ నిరాశపరిచినా.. జురెల్ మాత్రం మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లు ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు క్రీజులో నిలబడటానికే తంటాలు పడుతున్న పిచ్ మీద అతడు.. 149 బంతులాడి 90 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్‌తో కలిసి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో అతడు.. 77 బంతుల్లో 39 పరుగులు చేశాడు. ఆకాశ్ దీప్ విషయానికొస్తే.. రాంచీ టెస్టులో తొలి రోజు మొదటి సెషన్‌లోనే ఇంగ్లండ్‌ను అతడు దెబ్బతీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన అతడు.. ఆ జట్టును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. దేశవాళీలో పరుగుల వరద పారించినా.. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున మెరుపులు మెరిపించినా పాటిదార్ జాతీయ జట్టులో మాత్రం ఆ స్థాయి ప్రదర్శనలు ఇవ్వలేకపోతున్నాడు. అసలు రాంచీ టెస్టులోనే అతడికి స్థానం దక్కపోవచ్చన్న వాదనలు వినిపించినా టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం అతడి మీద నమ్మకముంచింది. అయినా పాటిదార్ మాత్రం ఈ టెస్టులోనూ విఫలమై ధర్మశాల టెస్టులో ఆడే అవకాశాన్ని కోల్పోయాడు. ఇదివరకే సిరీస్ గెలిచిన నేపథ్యంలో భారత్..



# రికార్డు సృష్టిస్తున్న నాని సినిమా?


టాలీవుడ్ యంగ్ హీరోన్యాచురల్ స్టార్నాని హీరోగా నటించిన హాయ్ నాన్నసినిమా సూపర్ హిట్ కావడంతో పాటు ఫీల్ గుడ్? మూవీగా లెక్కలేనన్ని ప్రశంసలు దక్కించుకుంది.కొత్త దర్శకుడు శౌర్యవ్? ఈ మూవీని తెరకెక్కించిన విధానం, అతడి టేకింగ్ అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా మృణాల్ ఠాకూర్ నటన, హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం మెప్పించాయి. తెలుగుతో పాటు హిందీలో కూడా 'హాయ్ పాపా' అనే పేరుతో ఈ చిత్రం రిలీజ్ అయింది. అయితే, థియేటర్లలో హిందీ వెర్షన్‌కు అనుకున్న స్థాయిలో స్పందన అయితే రాలేదు.కానీ ఓటీటీలో మాత్రం ఈ సినిమా సీన్ పూర్తిగా మారింది.హాయ్ నాన్నసినిమా నెట్?ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగుతో పాటు హిందీ, కన్నడ, తమిళం ఇంకా మలయాళం భాషల్లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. జనవరి 4వ తేదీన ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమ్ అయ్యింది. తొలి వారం తెలుగుతో పాటు హిందీ వెర్షన్ 'హాయ్ పాపా'కు సూపర్ డూపర్ రెస్పాన్స్ వచ్చింది.ఏకంగా టాప్-5లో ట్రెండ్ అయ్యాయి. అయితే, హిందీ వెర్షన్ జోరు మాత్రం 50 రోజులైన ఇప్పటికీ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇంకా ఈ సినిమా టాప్-10లో కంటిన్యూ అవుతోంది.'హాయ్ పాపా' చిత్రం 50 రోజుల నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ఇండియా ట్రెండింగ్‌లో టాప్-10లోనే కొనసాగుతోంది. సోషల్ మీడియాలో కూడా చాలా మంది హిందీ జనాలు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తున్నారు. మన నాని పర్ఫార్మెన్స్‌కు ఫిదా అవుతున్నారు. దీంతో హిందీలో కూడా న్యాచులర్ స్టార్ బాగా పాపులర్ అయ్యారు. మొత్తానికి నార్త్ లో నానికి దసరా సినిమాతో రాని క్రేజ్ హాయ్ పాపా సినిమాతో వచ్చింది.నాని తదుపరి మూవీ 'సరిపోదా శనివారం' కూడా పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కానుంది.ఈ సినిమా ఓవర్ సీస్ రైట్స్ ని ప్రత్యాంగిరా వాళ్ళు కొన్నారు.'హాయ్ పాపా' మూవీ నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో సూపర్ పాపులర్ కావడంతో హిందీలో 'సరిపోదా శనివారం' మూవీకి ప్లస్ అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సరిపోదా శనివారం మూవీ హిందీలో 'సూర్యాస్ సాటర్‌డే' పేరుతో రిలీజ్ కానుంది.




# ధనుష్‌కు జోడీగా అపర్ణ బాలమురళి..

**సూర్య హీరోయిన్‌కు బంపర్ ఆఫర్!**

కోలీవుడ్ నటుడు ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం రాయన్ ధనుష్ కెరీర్‌లో 50వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు నటనతో పాటు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంనుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. మాంసం అమ్మేవాడి పాత్రలో ధనుష్ ఊరమాస్ లుక్‌లో కసిపిస్తున్నాడు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో నటించే కథనాయికను పరిచయం చేసింది చిత్రయూనిట్. మూవీలో ధనుష్‌కు జోడీగా ఆకాశం నీ హద్దురా ఫేమ్ అపర్ణ బాలమురళి  నటిస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రాయన్ నుంచి అపర్ణ బాలమురళి ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఎ. ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో 2024లోనే విడుదల కానుంది. ఇక ఈ చిత్రంలో సందీప్ కిషన్‌తో పాటు కాళిదాస్ జయరాం కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# అందుకే ఆ టైటిల్ పెట్టాం..

## ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌పై క్లారిటీ ఇచ్చిన నాగ్ అశ్విన్

సలార్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్‌లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా టైటిల్‌పై ఇంట్రెస్టింగ్ న్యూస్ పంచుకున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' అని పెట్టినప్పటినుంచి ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ టైటిల్ 'కల్కి 2898 ఏడీ' అని పెట్టడానికి గల కారణాన్ని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తవుతుంది. గతంతో మొదలై ఫ్యూచర్‌తో ముగుస్తుంది కాబట్టి ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమాలో మొత్తం 6000 ఏండ్ల మధ్య జరిగే కథను చూపించబోతున్నాం. దానికి తగ్గట్లు ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. అంటూ నాగ్ అశ్విన్ వెల్లడించాడు. ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. అత్యంత భారీ బడ్జెట్‌తో వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొణే, దిశా పటానీ, పశుపతి లాంటి సూపర్‌స్టార్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

# హైదరాబాద్‌కి షిఫ్ట్ అయిన 'తండేల్'

చైతూ కెరియర్ లోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ గా 'తండెల్' రూపొందుతోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాని దసరా టైంలోనే రిలీజ్ చేయాలని మేకర్స్ నిర్ణయించినట్లు ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.ఎన్టీఆర్ 'దేవర' మూవీ అక్టోబర్ 10న రిలీజ్ కాబోతోంది. నాగచైతన్య 'తండెల్' కూడా సరిగ్గా అదే సమయంలో అంటే ఎన్టీఆర్ 'దేవర'కి పోటీగా థియేటర్స్ లో సందడి చేయనున్నట్లు వార్తలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ దసరాకి బాక్స్ ఆఫీస్ దగ్గర 'దేవర', 'తండేల్' సినిమాల మధ్య గట్టి పోటీ ఉండే అవకాశం ఉంది. 'తండేల్' సినిమా నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. గుజరాత్ రాష్ట్రం సూరత్ లోని ఒక మత్స్యకారుడి నిజ జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు చందు మొండేటి. ఇందుకోసం చాలానే రీసెర్చ్ చేశారు. ఈ కథంతా సముద్ర తీర ప్రాంతం చుట్టూనే తిరుగుతుంది. శ్రీకాకుళంలో మొదలై పాకిస్థాన్ వరకూ చేరుకుంటుందట. చైతు ఇందులో మత్స్యకారుడి పాత్రలో కనిపించనున్నాడు. సినిమాలో ఎమోషనల్ లవ్ స్టోరీ తో పాటు దేశభక్తి కోణాన్ని కూడా చూపించబోతున్నారు. ఇక తాజాగా 'తండెల్' లేటెస్ట్ షెడ్యూల్ ని హైదరాబాద్ లో ప్లాన్ చేశారు. దీనికోసం కోసం హైదరాబాదులో పాకిస్తాన్ జైల్ సెట్ వేసినట్లు తెలిసింది. రియాలిటీకి దగ్గరగా ఉండేలా సెట్ వర్క్ ఉండనున్నట్లు సమాచారం. అందుకోసం నిర్మాత బన్నివాసు గట్టిగానే ఖర్చు చేస్తున్నారట. ఈ వారం నుంచి ఆ సెట్ లో నాగచైతన్య పై కొన్ని కీలక సన్నివేశాలను తీయనున్నారుట.'తండేల్' సినిమాలో నాగచైతన్య సరసన నాచురల్ బ్యూటీసాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్లో 'లవ్ స్టోరీ' అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో చైతు, సాయి పల్లవి పెయిర్ ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. సినిమాలో ఇద్దరూ తమ న్యాచురల్ పర్ఫామెన్స్ తో ఆడియన్స్ ని కట్టిపడేసారు. ఇప్పుడు మరోసారి 'తండెల్' తో అదే మ్యాజిక్ రిపీట్ కాబోతోంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com